## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

# జనసముద్రం న్యూస్

నిరంతర వార్తా ప్రవాహం

ప్రతి అక్షరం జనం కోసం

3rd ANNIVERSARY CELEBRATIONS

సంపుటి: 03 సంచిక : 52 సోమవారం, 23 సెప్టెంబరు 2024 RNI NO: APTEL16151 పేజీలు : 8 వెల: రూ.2




# ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు

జాగ్రత్తగా పనిచేస్తే రెండోసారి కూడా అధికారం మనదే..

ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి చేర్చే బాధ్యత తీసుకోవాలి

గత 9 నెలల్లో ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశా..

కాంగ్రెస్‌లో కష్టపడి పనిచేస్తే కచ్చితంగా అవకాశాలు లభిస్తాయని వ్యాఖ్య

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఎమ్మెల్యేలకు వివరించిన ముఖ్యమంత్రి

హైదరాబాద్: కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో జాగ్రత్తగా పనిచేయాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అవినీతికి తావు ఇవ్వొద్దని, ముఖ్యంగా అధికారుల పోస్టింగ్‌ల విషయంలో జోక్యం చేసుకోకుండా ఉంటే మంచిదని స్పష్టం చేసినట్టు తెలిసింది. గత ప్రభుత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడటం, పోస్టింగుల విషయంలో జోక్యం చేసుకోవడం వల్లే ఓటమి పాలయ్యారని వ్యాఖ్యానించినట్టు సమాచారం. అందువల్ల ఎలాంటి ఆరోపణలు, విమర్శలకు అవకాశం ఇవ్వకుండా జాగ్రత్తగా పనిచేసుకుంటే.. రెండోసారి కూడా అధికారంలోకి వస్తామని పేర్కొన్నట్టు తెలిసింది. టీపీసీసీ నూతన అధ్యక్షుడిగా మహేశ్‌కుమార్‌గౌడ్ బాధ్యతల స్వీకారం నేపథ్యంలో.. ఆయనకు అభినందనలు తెలిపేందుకు ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సీఎల్పీ సమావేశమైంది. ఈ కార్యక్రమంలో మహేశ్‌కుమార్‌గౌడ్‌ను పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు సన్మానించారు. మహేశ్‌గౌడ్ నియామకంపై పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్ గాంధీలకు ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. అనంతరం రాష్ట్ర రాజకీయాలు, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీలో సమన్వయం తదితర అంశాలపై చర్చించారు.

సమావేశంలో సీఎం రేవంత్ మాట్లాడుతూ.. పార్టీ, ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం గత తొమ్మిది నెలల్లో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా ప్రజలకు తీసుకెళ్లే బాధ్యతలను పార్టీ నేతలు తీసుకోవాలని కోరారు. "పీసీసీ అధ్యక్షుడిగా నా ఆధ్వర్యంలో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చాం. లోక్‌సభ సీట్లు గెలిచాం. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పనిచేసిన వారికి పదవులు ఇచ్చాం. కష్టపడి పనిచేసిన వారికి కాంగ్రెస్ పార్టీలో కచ్చితంగా అవకాశాలు వస్తాయి. నిబద్ధత కలిగిన నాయకుడు కాబట్టే మహేశ్ గౌడ్‌కు పీసీసీ అధ్యక్ష పదవి వచ్చింది. బీసీల కులగణన చేయాలన్నది రాహుల్ గాంధీ బలమైన ఆలోచన. ఆయన ఆలోచన మేరకు రాష్ట్రంలో బీసీ కమిషన్ చైర్మన్, సభ్యులను

(మిగతా 2వ పేజీలో)



# మళ్లీ హైడ్రా పంజా

కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడల్లో అక్రమ నిర్మాణాల కూల్చివేత

రాత్రి వరకు కొనసాగిన ప్రక్రియ

పటాన్‌చెరు: ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేశారంటూ హైడ్రా అధికారులు సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని కిష్టారెడ్డిపేట్, పటేల్‌గూడలలో భవంతులను నేలమట్టం చేశారు. అమీన్‌పూర్ రెవెన్యూ అధికారుల నివేదిక మేరకు హైడ్రా అధికారులు ఆయా నిర్మాణాలను కూల్చివేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి కూల్చివేతల ప్రక్రియను చేపట్టారు. కిష్టారెడ్డిపేట్‌లో మూడు పెద్ద భవనాలను, పటేల్‌గూడలో 22 విల్లాలను కూల్చివేశారు. ఈ ప్రక్రియ ఆదివారం రాత్రి వరకూ కొనసాగుతూనే ఉంది. కూల్చివేతల కోసం భారీ క్రేన్లను వినియోగించారు. అమీన్‌పూర్ రెవెన్యూ అధికారులు, మున్సిపల్ అధికారులు కూల్చివేత ప్రక్రియలో పాల్గొన్నారు. పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. పటేల్‌గూడలో విల్లాలు నిర్మించిన యజమాని అధికారులతో వాగ్వాదానికి దిగారు. నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయని చెప్పారు. అయితే తాము ప్రభుత్వ భూమి పరిధిలోకి వచ్చే నిర్మాణాలను మాత్రమే కూల్చివేస్తున్నామని తహసీల్దార్ రాధ ఆయనకు వివరించారు. విల్లాల నిర్మాణానికి సర్వే నంబర్ 6 పరిధిలో అనుమతులు తీసుకొని

(మిగతా 2వ పేజీలో)



# లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు

లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు..

ఐజీ స్థాయి అధికారి నేతృత్వంలో బృందం: సీఎం

వైసీపీ రాగానే ఇష్టానుసారం సభ్యుల నియామకం

టీటీడీలో 50 మందిని నియమిస్తే కోర్టుకెళ్లాల్సి వచ్చింది

కనిపించినవారందరినీ ఎక్స్-అఫిషియో చేశారు

అడ్డగోలుగా దర్శనం టికెట్లు అమ్మారు

దీనికి నిరసనగా నేను, పవన్ నాడు ధర్నా చేశాం

అందరి మనోభావాలూ దెబ్బతిన్నాయి

అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారు: సీఎం

అమరావతి, సెప్టెంబరు 22 : తిరుమల లడ్డూ కల్తీపై ఐజీ, అంతకంటే పైస్థాయి అధికారి ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. తిరుమలలో జరిగింది అపచారమని స్పష్టం చేశారు. 'మనోభావాలు దెబ్బతిన్న హిందువులకు, ఇతర మతస్థులకు విజ్ఞప్తి చేస్తున్నా. తెలిసి చేసినా, తెలియక చేసినా తప్పు తప్పే. అన్నింటి కంటే పెద్దదైన వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన సమయంలో అధికార దుర్వినియోగం వల్ల అడుగడుగునా సెంటిమెంట్లు దెబ్బతిన్నాయి. వ్యాపార సంస్థగా, రాజకీయ పునరావాస కేంద్రంగా, వారికి కావలసిన పనులు చేయించుకునేందుకు టీటీడీని ఉపయోగించుకున్నారు. దానిపై చాలా మంది బాధపడ్డారు. ఏదైనా మళ్లీ ప్రజల మనోభావాలను కాపాడే బాధ్యత మేం తీసుకుంటాం. భవిష్యత్‌లో ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటాం' అని స్పష్టం చేశారు. ఆదివారమిక్కడి ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, నాదెండ్ల మనోహర్‌తో కలిసి చంద్రబాబు విలేకరులతో మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఇష్టానుసారంగా టీటీడీ బోర్డు సభ్యులను నియమించారన్నారు. 50 మంది సభ్యులను నియమిస్తే కోర్టుకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని, కనపడిన వారందరినీ ఎక్స్‌అఫిషియో సభ్యులుగా నియమించారని ఆక్షేపించారు. 'శ్రీవారి దర్శనం టికెట్లను ఇష్టారీతిగా విక్రయించారు. దానిపై నేను, పవన్ కల్యాణ్ ధర్నాలు చేశాం. తిరుమలకు అనుమతించకపోవడంతో అలిపిరి వద్ద ధర్నా చేసి వెనక్కి వచ్చాం' అని గుర్తుచేశారు. అన్య మతస్తులకు ప్రాధాన్యమివ్వడం, దేవుడిపై నమ్మకం లేని వారిని దేవాలయాల్లో పెట్టడం, రాజకీయ ప్రయోజనాల కోసం

(మిగతా 2వ పేజీలో)



## నిలబడతాం.. బలపడతాం

మా కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు

అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం

శాంతియుతంగా సమస్యల పరిష్కారం

భద్రత, సాంకేతికత, వాతావరణ మార్పులు..

సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యాలు

క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ



'అమృత్'లో అక్రమాలు తేలకపోతే

## రాజకీయ సన్యాసం

మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్

అమృత్ పథకం టెండర్లలో స్కాం నిజమే

సీవీసీ లేదంటే హైకోర్టు సీజే దగ్గరికి వెళ్దాం

ఫైళ్లు ముందుపెట్టి విచారణను కోరుదాం

కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం

# చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా?

జగన్‌కు పవన్ సూటి ప్రశ్న.. నెయ్యి కల్తీని ఆయన ఎలా సమర్థిస్తారు?

జంతువుల కొవ్వు కలపడం దుర్మార్గం.. అయోధ్యకూ అవే లడ్లు పంపారు

ఏ మతంపై దాడి జరిగినా స్పందిస్తాం.. వైసీపీ హయాంలో టీటీడీలో అవకతవకలు

గత ఐదేళ్లలో 219 ఆలయాలు అపవిత్రం.. వైసీపీ తప్పులకు ఫుల్ స్టాప్ పెట్టాలి

నెయ్యి కల్తీకి గత టీటీడీ బోర్డుదే బాధ్యత.. సుబ్బారెడ్డి, ధర్మారెడ్డిపై విచారణ జరగాలి



పెదకాకాని, సెప్టెంబరు 22: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేయడం దుర్మార్గమైన చర్య అని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. లడ్డూకు వినియోగించిన నెయ్యిలో పశువుల కొవ్వు, పంది కొవ్వు, చేప నూనె, సోయా, సన్ ఫ్లవర్ లాంటి ఇతర నూనెలు ఉన్నట్లు ఎన్‌డీడీబీ సీఏఎల్‌ఎఫ్ ల్యాబ్ నివేదిక ఇచ్చిందని వెల్లడించారు. వైసీపీ హయాంలో ఇలాంటి నేతిని వినియోగించిన లక్ష లడ్డూలను అయోధ్య రామ జన్మభూమి మందిరానికి టీటీడీ పంపి చాలా పెద్ద తప్పు చేసిందని అన్నారు. హిందువులు మహాప్రసాదంగా భావించే తిరుమల లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వు కలపడం నీచమైన చర్య అని దుయ్యబట్టారు. ప్రతి హిందువూ, ధర్మాన్ని పాటించే ప్రతి వ్యక్తి దీన్ని ఖండించి పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. తిరుపతి లడ్డూ ప్రసాదం అపవిత్రమైన నేపథ్యంలో క్షమించమని వేంకటేశ్వర స్వామిని కోరుతూ ఆయన ఆదివారం ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. గుంటూరు జిల్లాలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట గల శ్రీ దశావతార వేంకటేశ్వర స్వామి ఆలయంలో దీక్ష మాలధారణ తీసుకున్నారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ... కేబినెట్, అసెంబ్లీలో చర్చించి దోషులను కఠినంగా శిక్షిస్తామని స్పష్టం చేశారు. "తప్పులు చేసిన వారిపై చర్యలు తీసుకోకుండా జగన్ వారిని

(మిగతా 2వ పేజీలో)

# లడ్డూ అపచారంపై సిట్ దర్యాప్తు

టీటీడీని వినియోగించారని విమర్శించారు. 'వాళ్లు రాగానే నెయ్యి, ఇతర సరుకుల సరఫరాకు సంబంధించి రివర్స్ టెండర్ల పేరుతో నిబంధనలు మార్చారు. 18వ నిబంధనలో ఉన్న మూడేళ్ల అనుభవాన్ని ఏడాదికి తగ్గించారు. డెయిరీ పెట్టిన మూడేళ్ల తర్వాతకు బదులుగా ఏడాదిలోనే నెయ్యి సరఫరా చేయవచ్చని పెట్టారు. 4 లక్షల లీటర్ల పాల ఉత్పత్తి అనుభవం ఉండాలి. ఆ నిబంధనా తీసేశారు. అదే విధంగా 8 టన్నుల ఉత్పత్తి చేయాలన్న నిబంధనా తొలగించారు. రివర్స్ టెండరింగ్‌తో విన్యాసాలు చేశారు. పెద్ద సంస్థలు రాకుండా చేశారు. అనుభవం లేని వారికి, డెయిరీయే లేని వారికి అవకాశమిచ్చారు. దీంతో వారు నాసిరకం నెయ్యి సరఫరా చేశారు. కల్తీ నెయ్యితో అందరి మనోభావాలు దెబ్బతిన్నాయి' అని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే..



### నిబద్ధత కలిగిన ఈవోను నియమించా..

లడ్డూ మూడ్రోజుల్లోనే చెడిపోవడం, ఘుమఘుమలాడాల్సిన లడ్డూ పాచిపోయినట్లుగా, రంగుమారినట్లుగా కనబడుతుండడంతో తినాలన్నా బాధవేసేది. నేను ముఖ్యమంత్రి కాగానే.. మిగతా పోస్టింగుల గురించి ఆలోచించలేదు. టీటీడీ ఈవోగా ఎవరిని నియమిస్తే ప్రక్షాళన జరుగుతుందో ఆలోచించి శ్యామల రావును నియమించాను. తిరుమలలో అపవిత్ర కార్యక్రమాలు జరిగాయని, ప్రక్షాళన మొదలు పెట్టాలని సూచించా. పుణ్యక్షేత్రానికి పూర్వ వైభవం తేవడానికి భగవంతుడు ఆదేశాలిచ్చాడు.. ఆ ఆదేశాలనే నీకిస్తున్నానని చెప్పాను. అప్పటి నుంచి రోజురోజుకూ పురోగతి చూస్తున్నాం. ఎవరైతే నాసిరకం సరఫరా చేస్తున్నారో ఆ కాంట్రాక్టర్లకు వార్నింగ్ ఇచ్చారు. కల్తీ పరీక్షలు చేసే వ్యవస్థలు టీటీడీలో లేవు. ఇప్పటిదాకా నమ్మకం, పవిత్రతతో పదార్థాల సరఫరా జరిగింది. భయం, భక్తి ఉండడంతో వాటిలో నాణ్యతా ప్రమాణాలు ఉండేవి. ఇప్పుడు తేడా రావడంతో ఎన్‌ఏబీఎల్ అక్రిడిటేషన్ కోసం ఎన్‌డీడీబీకి పంపితే షాకింగ్ నివేదిక వచ్చింది. కల్తీ ఉన్నట్లు తేలింది. సోయాబీన్, సన్‌ఫ్లవర్, ఆలివ్, గ్రాప్‌సీడ్, లిమ్‌సీడ్స్, కాటన్‌సీడ్, ఫిష్ ఆయిల్.. పంది కొవ్వు ఉన్నట్లు అందులో స్పష్టంగా పేర్కొన్నారు. ఇది చూసిన తర్వాత ఈవో జూలై 22, 23ల్లో ఆ కంపెనీ వారికి మెమోలు ఇచ్చారు. ఆ నివేదిక దాచిపెడితే భక్తుల మనోభావాలు ఏ విధంగా ఉంటాయి? రెండ్రోజులు దీనిపై ఆలోచించాం. కేంద్ర మంత్రులు, పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరితో మాట్లాడా. జరిగిన అపచారానికి, అపవిత్రతకు బాధపడుతున్నాం. ఎలాంటి చిన్న నిర్లక్ష్యం లేకుండా ప్రక్షాళన చేసి పవిత్రతను కాపాడేందుకు మన వంతు చేయాల్సింది చేయాలని భావిస్తున్నాం. ఏఆర్ కంపెనీ నుంచి వచ్చిన నెయ్యిని వాడేశారు. అది వాడిన తర్వాత శాంపిల్స్‌ను పంపించి నియంత్రించారు. ఆగమ సలహామండలితో చర్చించారు. ఆలయ సంప్రోక్షణపై చర్చించి, ఇప్పుడు వెలుగు చూసిన అంశాల వల్ల ఇతర దోషాలు తొలగిపోయేందుకు సోమవారం ఉదయం శాంతి హోమం నిర్వహిస్తారు. శ్రీవారి ఆలయంలో బంగారుబావి వద్ద శుద్ధి చేయాలని నిర్ణయించారు. జరిగిన అపచారానికి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ప్రాయశ్చిత దీక్ష చేస్తున్నారు.

### ఆ అధికారం ఎవరిచ్చారు?

భక్తుల మనోభావాలు దెబ్బతిని కుంగిపోయే పరిస్థితి తెచ్చారు. ఆ అధికారం ఎవరిచ్చారు? జగన్.. నీది మనిషి పుట్టుకేనా? కరుడు కట్టిన నేరస్థుడు రాజకీయ ముసుగులో ప్రజలను మోసం చేయడానికి వచ్చి.. అబద్ధాలను సత్యాలుగా చేయాలని చూస్తున్నప్పుడు ప్రమాదమని హెచ్చరిస్తున్నాం. ఎంత ధైర్యముంటే ఎదురుదాడి చేస్తారు? బోర్డు సభ్యులుగా ఎవరిని వేశారు? ఈవోగా ఎవరిని వేశారు? ఇంట్లో ఎవరైనా చనిపోతే ఏడాది పాటు వేంకటేశ్వరస్వామి వద్దకు రారు. కొడుకు చనిపోతే 12వ రోజు గుడికి వస్తావా (అప్పటి ఈవో ధర్మారెడ్డినుద్దేశించి)? అన్య మతస్థులు అబ్దుల్ కలాం, సోనియాగాంధీ సైతం అఫిడవిట్ ఇచ్చి తిరుమలకు వస్తే.. జగన్ ఎందుకు ఇవ్వలేదు? అన్ని అకౌంట్లూ స్వామి సెటిల్ చేస్తారని గతంలో కూడా పలు దఫాలు చెప్పాను. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు స్వామికి ఉన్నది ఏడుకొండలు కాదు.. రెండు కొండలేనంటే పోరాడాను. పాదయాత్ర చేసి ఏడుకొండలూ ఎక్కి మొక్కు తీర్చుకున్నా. దేవుడి పవిత్రత కాపాడేందుకు ఎన్నో చేశాం. అలాంటి పవిత్ర క్షేత్రంలో గడచిన ఐదేళ్లలో అపవిత్ర కార్యక్రమాలు చేశారు. వేంకటేశ్వరస్వామి లడ్డూకు ప్రత్యేకత ఉంది. దానికి కారణం ఎన్నో ఏళ్లుగా దానిని తయారుచేసే విధానమే. అందులోని పదార్థాలు స్వచ్ఛంగా ఉంటాయి. నాణ్యత లేకుండా వాడరు. సరఫరాదారులు కూడా పవిత్రమైన భావంతో సరఫరా చేస్తారు. లడ్డూ మాత్రమే కాదు, జిలేబీ, వడ, పొంగల్ దేనికదే ప్రత్యేకం. భోజన శాలలో వంటలు కూడా రుచికరంగా ఉంటాయి. లడ్డూకు 2009లో పేటెంట్ హక్కు కూడా వచ్చింది. దానిని కాపీ చేసే అవకాశమే లేదు. ఎంత ప్రయత్నించినా తిరుమల లడ్డూ మాదిరి లడ్డూ చేయలేకపోయారు. అలాంటి ప్రసాదంలో నాణ్యత లేదని, అపవిత్రం చేశారని ఎన్నో సార్లు భక్తులు ఆందోళన చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. టీడీపీ గతంలో అధికారంలో ఉన్నప్పుడు తిరుమలలో అన్నదానం, ప్రాణదానం ప్రవేశపెట్టాం. ఎన్టీఆర్ వైకుంఠం కాంప్లెక్-1 నిర్మించారు. నేను వైకుంఠం కాంప్లెక్స్-2 నిర్మించా. రామ్‌దేవ్‌బాబాను తీసుకొచ్చి వేంకటేశ్వర ఆయుర్వేద కళాశాలతో అనుసంధానం చేసి తిరుమల అంతా ఆయుర్వేద మొక్కలు పెట్టి ప్రోత్సహించాను. శ్రీవారికి సంప్రదాయబద్ధంగా వస్త్రాలు సమర్పించే సమయంలో నాపై క్లెమోర్ మైన్స్ దాడి జరిగింది. ఆ భగవంతుడి కృపవల్ల బతికాను. అన్ని దేవాలయాల్లో అపవిత్రతపై దర్యాప్తు చేసి.. నివేదిక వచ్చాక కఠిన చర్యలు తీసుకుంటాం. భవిష్యత్‌లో నెయ్యి కల్తీ వంటివి జరగకుండా చేస్తాం. ఏ ప్రార్థనా మందిరాల్లో అయినా ఆ మతాల వారి నిర్వహణే ఉండాలి. అందులో నేరస్థులు గానీ, సంఘ విద్రోహ శక్తులు గానీ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దేవాలయాలు, మసీదులు, చర్చిల్లో ఇవన్నీ మేం కచ్చితంగా పాటిస్తాం. అందరం మత సామరస్యం కాపాడుకోవాలి. అవసరమైతే ప్రత్యేక చట్టాన్ని తెచ్చి అమలు చేస్తాం. అన్ని దేవాలయాల్లో మహిళలను గౌరవించే విధంగా ప్రత్యేక సిఫారసులు తీసుకుని చర్యలు తీసుకుంటాం.

# చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా?

ఎలా సమర్థిస్తారు? కోట్ల మంది హిందువులు స్వీకరించే ప్రసాదాన్ని అపవిత్రం చేస్తారా? దోషులకు శిక్ష పడాల్సిందే. చర్చి, మసీదులో ఇలా జరిగితే దేశం అల్లకల్లోలం అయిపోయేది. ప్రపంచం అంతా మాట్లాడేది. గ్లోబల్ న్యూస్ అయ్యేది. అదే హిందువులకు జరిగితే మాట్లాడకూడదా? సెక్యూలర్ వ్యవస్థకు విఘాతం కలుగుతుందా? హిందువులకు మనోభావాలు ఉండవా? ఏ మతంపై దాడి జరిగినా ఇలాగే స్పందిస్తాం. గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డిని సూటిగా అడుగుతున్నాను. తిరుమలలో జరిగిన విధంగా ఒక చర్చికి అపవిత్రం జరిగితే ఊరుకుంటావా? ఒక మసీదుకు జరిగితే ఊరుకుంటావా? మరి తిరుమలలో అపవిత్రం జరిగితే ఎందుకు మాట్లాడకూడదని అంటున్నారు? మేము మాట్లాడతాం. హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ఏ మతం మీద దాడి జరిగినా మాట్లాడతాం. సనాతన ధర్మంపై దాడి జరిగినా మాట్లాడుతాను. తిరుమల ఘటనలో దోషులకు కఠిన శిక్ష పడాల్సిందే. ముఖ్యమంత్రి చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాను. గత ప్రభుత్వ హయాంలో టీటీడీలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, అపచారాలపై విచారణ జరగాలి. దోషులను శిక్షించాలి. నిన్న మీడియా ప్రతినిధులు సీబీఐ విచారణకు ఈ కేసు తీసుకువెళ్తారా అని అడిగారు. కేబినెట్‌లో చర్చ జరిగే విధంగా చూసి, దీనిపై నిర్ణయం తీసుకోవలసిందిగా ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తున్నాను. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా మేము సహకరిస్తాం. తిరుమలలో జరిగిన ఘటన భవిష్యత్తులో జరగకుండా చ్యూసలా మా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది" అని పవన్ స్పష్టం చేశారు. "నెయ్యి కల్తీపై గత టీటీడీ బోర్డు బాధ్యత వహించాలి. నాటి చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో ధర్మారెడ్డి, ఇతర పాలక వర్గంపై విచారణ జరగాలి. తప్పులు చేస్తే మాది ఉపేక్షించే ప్రభుత్వం కాదు. టీటీడీ బోర్డు ఉన్నది ధర్మాన్ని పరిరక్షించడానికి మాత్రమే. దర్శనం టికెట్లు మీ వారికి ఇచ్చుకోవడానికో, మీ ఇష్టానికి కాంట్రాక్టులు ఇవ్వడానికో కాదు" అని పవన్ అన్నారు.

### ఒక్కరూ ప్రశ్నించలేదు

"తిరుమలలో ప్రతి రోజు దాదాపు 15వేల కిలోల నెయ్యి వినియోగిస్తారు. కిలో నెయ్యి తయారీకి దాదాపు రూ.వెయ్యి ఖర్చవుతుంది. అలాంటిది రూ.360కే వస్తుందని మధ్యవర్తి చెబితే క్వాలిటీ చెక్ చేయకుండా ఎలా తీసుకుంటారు.? స్వామివారి ప్రసాదంలో కల్తీ



జరుగుతుంటే అధికారులు, బోర్డు సభ్యులు ఎందుకు మాట్లాడలేదు? వైసీపీ అంటే భయమా? లేక సుబ్బారెడ్డి అంటే భయమా? ఉద్యోగులు మౌనంగా ఉండి మహా అపరాధం చేశారు. ఈ అపరాధంతో నాకు సంబంధం లేకపోయినా ప్రాయశ్చిత్త దీక్ష తీసుకుంటున్నాను. శ్రీవాణి ట్రస్టు పేరుతో రూ.10 వేలు వసూలు చేశారు. ఐదుగురు కుటుంబ సభ్యులు స్వామివారి దర్శనానికి వస్తే రూ.50వేలు వసూలు చేసి బిల్లు మాత్రం రూ.500 చొప్పునే ఇచ్చారు. తప్పు జరుగుతోందని వేలెత్తి చూపినా వైసీపీ నాయకులు పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రసాదాల నాణ్యత తగ్గిపోయింది. లడ్డూను కూడా కల్తీ చేశారు. గత ప్రభుత్వంలో 219 ఆలయాలను అపవిత్రం చేశారు. రథాలు తగలబెట్టారు. రామతీర్థం ఆలయంలో రాముడి విగ్రహానికి శిరచ్ఛేదం చేశారు. దోషులను పట్టుకోలేకపోయారు. వైసీపీ తప్పులకు ఫుల్ స్టాప్ పెట్టాలి. దాడులు జరుగుతున్నప్పుడు చూస్తూ కూర్చోవడం కూడా తప్పే. ధర్మాన్ని పాడు చేసే హక్కు ఎవరికి లేదు. పగ, ప్రతీకారం తీర్చుకునే ప్రభుత్వం కాదు మాది" అని పవన్ అన్నారు.

# ఎమ్మెల్యేలూ.. జర జాగ్రత్త!

నియమించాం. బీసీలకు రిజర్వేషన్లు ఇవ్వాలంటే వారి జనాభాను లెక్కించాల్సిందే. ఎస్సీ వర్గీకరణ అమలుపై ఉత్తమ్ నాయకత్వంలో మంత్రివర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేశాం. ఈ కమిటీ సుప్రీం తీర్పును పూర్తిగా అధ్యయనం చేసి నివేదిక ఇస్తుంది. దేశంపై నాలుగోసారి పట్టు సాధించడానికి మోదీ ప్రయత్నాలు చేస్తున్నారు. నాలుగోసారి గెలవడం కోసమే జమిలి ఎన్నికలు తీసుకువస్తున్నారు. ఈ ప్రతిపాదన పట్ల ఎమ్మెల్యేలు అప్రమత్తంగా ఉండాలి.." అని రేవంత్ పేర్కొన్నారు.

### ప్రజల్లో ఉండేవారికే డీసీసీల బాధ్యతలు

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఈ తొమ్మిది నెలల కాలంలో తాను ఒక్కరోజు కూడా సెలవు తీసుకోకుండా పనిచేశానని సీఎం రేవంత్ చెప్పారు. అధికారం కోల్పోయిన అసహనంతో ప్రతిపక్షం తప్పుడు ప్రచారాలు చేస్తోందని, ఆ ప్రచారాలను సమర్థవంతంగా తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా 27 రోజుల్లో రూ.18 వేల కోట్ల రైతు రుణమాఫీ చేయలేదని.. తెలంగాణలో చేసి చూపించామని చెప్పారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ హెల్త్ ప్రొఫైల్ డిజిటల్ కార్డు ఇస్తామని, రాష్ట్రంలో ఎక్కడున్నా రేషన్ తీసుకునే అవకాశం కల్పిస్తామని చెప్పారు. ప్రజల్లో ఉన్న వారికే కాంగ్రెస్ జిల్లా అధ్యక్ష పదవులు వస్తాయన్నారు. ఇన్‌చార్జ్ మంత్రులు వారానికి రెండు సార్లు తమ జిల్లాలో పర్యటించాలని సూచించారు.

# మళ్లీ హైడ్రా పంజా

సర్వే నంబర్ 12లో నిర్మిస్తున్నట్లు గుర్తించామని ఆమె స్పష్టం చేశారు. కాబట్టి ఎలాంటి కోర్టు స్టే ఆర్డర్ కూల్చివేతల ప్రక్రియలకు అడ్డుకాదని చెప్పారు. కిష్టారెడ్డిపేట్‌లో సర్వే నంబర్ 164లో మూడు భవంతుల నిర్మాణాలు జరిగాయని, వాటిని కూడా తొలగిస్తున్నట్లు తెలిపారు. కిష్టారెడ్డిపేట్‌లో సర్వే నంబర్ 164లో ప్రభుత్వ భూములలో నిర్మాణాలు చేశారని వారికి నోటీసులు ఇచ్చి తొలగిస్తున్నామని స్పష్టం చేశారు. కూల్చివేత ప్రక్రియకు ముందే హైడ్రా, రెవెన్యూ అధికారులు ప్రత్యేకమైన జాగ్రత్తలు తీసుకుని ప్రభుత్వ భూమి పరిధిలోకి వచ్చే ప్రాంతాన్ని పరిశీలించి కూల్చివేతలకు ఉపక్రమించారు. సామాన్య ప్రజలకు, పరిసర నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కూల్చివేతల్లో ఒక డాక్టర్ భవనం కూడా ఉండటం గమనార్హం. మరో భవనం ఏపీలోని ఒక ఎమ్మెల్యేకు సంబంధించిందని చెబుతున్నారు. ఈ సందర్భంగా బాధితులు తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము పాట్లను కొనుగోలు చేసి నిర్మాణాలు చేశామే తప్ప.. కబ్జా చేసి బహుళ అంతస్తులు నిర్మించలేదని వాదిస్తున్నారు.

### మరిన్ని కూల్చివేతలు..

కూల్చివేతల ప్రక్రియ కొనసాగుతుందని అధికార వర్గాలు స్పష్టం చేశాయి. కిష్టారెడ్డిపేట్ పరిసర గ్రామాల పరిధిలో ప్రభుత్వ స్థలాల్లో జరిగిన నిర్మాణాల కూల్చివేతకు అధికారులు నివేదిక రూపొందించినట్లు తెలిసింది. పొరుగు గ్రామాల ప్రభుత్వ భూముల్లో కిష్టారెడ్డిపేట్ పంచాయతీ అనుమతులతో జరిగిన నిర్మాణాలపై అధికారులు ఆరా తీస్తున్నట్లు తెలిసింది. అదే గ్రామంలో చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న నిర్మాణాలను కూడా రెవెన్యూ అధికారులు గుర్తించి హైడ్రాకు నివేదిక ఇచ్చి నట్టు సమాచారం.

# నిలబడతాం.. బలపడతాం

## క్వాడ్ శిఖరాగ్ర సదస్సులో ప్రధాని మోదీ

వాషింగ్టన్, సెప్టెంబరు 22: "క్వాడ్ కూటమి ఏ దేశానికీ వ్యతిరేకం కాదు. అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తాం. భద్రత, అభివృద్ధి చెందుతున్న సాంకేతికత, వాతావరణ మార్పులు, సామర్థ్య నిర్మాణమే మా లక్ష్యం. సమస్యలను శాంతియుతంగా పరిష్కరించుకోవడమే క్వాడ్ అభిమతం. మేం(క్వాడ్ కూటమి) నిలబడతాం.. బలపడతాం" అని భారత ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ స్వస్థలమైన విల్మింగ్టన్‌లో ఆదివారం జరిగిన క్వాడ్ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సులో ఆయన మాట్లాడారు. నాలుగేళ్లక్రితం ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యం, భద్రత వంటి అంశాలతో అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్, భారత్ కలిసి క్వాడ్ కూటమిగా ఏర్పడ్డ విషయం తెలిసిందే..! ఈ కూటమి ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జరిగిన సదస్సులో మోదీ, బైడెన్‌తోపాటు.. ఆస్ట్రేలియా ప్రధాని అల్బనెస్, జపాన్ ప్రధాని కిషిదా పాల్గొన్నారు. క్వాడ్‌కు వ్యతిరేకంగా చైనా వ్యాఖ్యలు చేస్తున్న నేపథ్యంలో.. మోదీ ఆ దేశం పేరును ప్రస్తావించకుండా తాము అన్ని దేశాల సార్వభౌమత్వాన్ని గౌరవిస్తామని, ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. తమ సందేశం ఒక్కటేనని, బలంగా నిలబడి, సభ్యదేశాల సహకారానికి కృషిచేస్తామని పేర్కొన్నారు. "ప్రపంచంలో ఉద్రిక్తతలు, సంఘర్షణలు చోటుచేసుకుంటున్న సమయంలో క్వాడ్ కూటమి ఏర్పాటైంది. మానవాళి శ్రేయస్సుకు, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణకు కంకణబద్ధమైంది. క్వాడ్ సదస్సులో ఫలవంతమైన చర్చలు జరిగాయి. ప్రపంచానికి మేలు జరిగేలా ఇంకా సమర్థంగా పనిచేయాలని నిర్ణయించాం" అని ఆయన వ్యాఖ్యానించారు. ఇండో-పసిఫిక్ రీజియన్‌లో స్వేచ్ఛాయుత వాణిజ్యానికి సహకరించేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. అంతకు ముందు ఆయన 'క్వాడ్ క్యాన్సర్ మూన్‌షాట్ ఈవెంట్'లో మాట్లాడుతూ.. ఇండో-పసిఫిక్ రీజియన్ దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, గుర్తింపు, చికిత్సకు భారత్ తరఫున రూ.62.61 కోట్ల(7.5 మిలియన్ డాలర్ల)ను అందజేస్తామని ప్రకటిస్తూ.. తమ లక్ష్యం 'ఒక భూగోళం.. ఒక ఆరోగ్యం' అంటూ నినదించారు. ఈ రీజియన్‌లోని దేశాలకు 4 కోట్ల డోసుల క్యాన్సర్ టీకాలను అందజేస్తామన్నారు.

# 'అమృత్'లో అక్రమాలు తేలకపోతే రాజకీయ సన్యాసం

**మంత్రి పొంగులేటి సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్**

**అమృత్ పథకం టెండర్లలో స్కాం నిజమే**

**సీవీసీ లేదంటే హైకోర్టు సీజే దగ్గరికి వెళ్దాం**

**ఫైళ్లు ముందుపెట్టి విచారణను కోరుదాం**

**కాంగ్రెస్‌పై మాజీ మంత్రి కేటీఆర్ ధ్వజం**

ముఖ్యమంత్రి భార్యకు సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని మంత్రి చెప్తున్నారు. భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలి. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ.8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలి. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని అమృత్ టెండర్లను వెంటనే రద్దు చేయాలి.

**-మాజీ మంత్రి కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 22 : కేంద్ర ప్రభుత్వ పథకమైన అమృత్ టెండర్ల విషయంలో మంత్రి పొంగులేటి విసిరిన సవాలును స్వీకరిస్తున్నానని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. అమృత్ పథకం టెండర్లలో తప్పు జరగలేదని నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని సవాల్ విసిరారు. వెంటనే కేంద్ర విజిలెన్స్ కమిషన్ (సీవీసీ) లేదంటే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. తెలంగాణభవన్‌లో ఆదివారం పార్టీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడిన కేటీఆర్.. 'నిన్న ఒక మంత్రి తప్పు జరిగిందని నిరూపిస్తే రాజీనామా చేస్తానని బిల్డప్ ఇచ్చారు. ఆయనకు నిజంగా చిత్తశుద్ధి ఉంటే ఇద్దరం కలిసి హైకోర్టు సీజే దగ్గరకి పోదాం.. వెంటనే సిట్టింగ్ జడ్జితోని ఎంక్వయిరీ చేయిద్దాం. సిట్టింగ్ జడ్జి గనుక ఇందులో తప్పులు ఏం జరగలేదు అంటే నేను రాజకీయ సన్యాసం తీసుకుంటా. హైకోర్టు సీజే దగ్గరికి




రావడానికి మంత్రిగారికి ఇబ్బంది ఉందంటే డేట్, టైం ఫిక్స్ చేయండి ఇద్దరం కలిసి కేంద్రంలో ఉండే సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ దగ్గరికి పోదాం. మంత్రిగారికి, ముఖ్యమంత్రికి ఒకటే చెప్తున్నా.. ఇప్పటికైనా టెండర్లు రద్దు చేయాలి' అని డిమాండ్ చేశారు. గతంలో ఉన్న ఫైల్స్‌తో పాటు ఇప్పటి టెండర్ల వ్యవహారం వివరాలు సీవీసీ లేదా రిటైర్డ్ జడ్జి ఎదుట ఉంచుదామని, న్యాయంగా తీర్పు చెప్పిన తర్వాత తాను చెప్పింది అబద్ధమంటే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం చేస్తానని స్పష్టంచేశారు. పొంగులేటి గతంలో కాంట్రాక్టర్‌గా ఉంటే ఉండొచ్చు కానీ ఈ రోజు మంత్రిగా ఉండి కాంట్రాక్టులు సంపాదించడం ముమ్మాటికి చట్టవ్యతిరేకమేనని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో జరిగిన ఈ టెండర్ల వ్యవహారంలో అవినీతి జరిగిందని సీఎంతోపాటు మంత్రి పొంగులేటికి కూడా తెలుసని పేర్కొన్నారు. కేవలం రెండు కోట్ల లాభం ఉన్న బామ్మర్ది కంపెనీకి రూ.1000 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి అవినీతి జరగడం లేదంటే ఎవరైనా నమ్ముతారా? అని ప్రశ్నించారు. ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్‌తోపాటు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లను కూడా తాను ప్రస్తావించిన నేపథ్యంలో మంత్రి పొంగులేటి ఆగమేఘాలమీద ప్రెస్‌కాన్ఫరెన్స్ నిర్వహించారని తెలిపారు. ముఖ్యమంత్రి భార్యకి సూదిని సృజన్‌రెడ్డి బంధువు కాదు, ఆమెకు స్వయానా సోదరుడని, భార్య తమ్ముడు బావమరిది కాకుండా ఇంకేమి అవుతాడో పొంగులేటి చెప్పాలని నిలదీశారు. ఒక్క రూపాయి అవినీతి జరిగినా, రూ. 8,888 కోట్ల అవినీతి జరిగినా ఈ చట్టం వర్తిస్తుందనే విషయం ఆయన తెలుసుకోవాలని సూచించారు. ఇప్పటికైనా జరిగిన తప్పును సీఎం ఒప్పుకొని జరిగిన టెండర్లను వెంటనే రద్దు చేయాలని సూచించారు. పొంగులేటి రాజీనామా చేయాల్సిన అవసరం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డినే రాజీనామా చేయాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని, ఈ బరితెగింపు మాటలు మానివేయాలని సూచించారు. లేకుంటే గతంలో అశోక్ చౌహాన్, యడ్యూరప్ప, సోనియాగాంధీ పదవులు పోయినట్టు మీ పదవులు కూడా పోతాయని హెచ్చరించారు.

# విశాఖ ఉత్తర నియోజకవర్గంలో ప్రముఖ్ గంకల కవిత

# అప్పారావు ఆధ్వర్యంలో జోరుగా సాగుతున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు

**నియోజకవర్గం అంతటా ముఖ్య నాయకులతో కలిసి సభ్యత్వ నమోదులో ఉత్తర నియోజకవర్గ ప్రముఖ్ గంకల కవిత అప్పారావు**

**ఉత్తర నియోజకవర్గంలో విశేష స్పందన లభిస్తుందని ప్రముఖ్ గంకల కవిత అప్పారావు స్పష్టికరణ**




జనసముద్రం న్యూస్, కప్పారాడ,విశాఖపట్నం,సెప్టెంబర్22

విశాఖ ఉత్తర నియోజకవర్గంలో నియోజకవర్గం శాసన సభ్యులు విష్ణు కుమార్ రాజు ఆదేశాలు మేరకు నియోజకవర్గం ఇంచార్జి సురేష్ బాబు ఆధ్వర్యంలో బీజేపీ 'సంఘటన పర్వ,సదస్యత అభియాన్ ప్రముఖ్ గంకల కవిత అప్పారావు ఆదివారం తెల్లవారి నుంచే ఉత్తర నియోజకవర్గంలో జరుగుతున్న భారతీయ జనతా పార్టీ సభ్యత్వ నమోదు నియోజకవర్గం అంతటా తిరిగి పరిశీలించారు.ఈ సందర్భంగా ఉత్తర నియోజకవర్గం ఆర్ అండ్ బి కూడలి మొదలుకొని నియోజకవర్గం అంతటా సభ్యత్వం నమోదు పరిశీలించారు.ఈ సందర్భంగా ప్రముఖ్ గంకల కవిత అప్పారావు బీజేపీ సభ్యత్వ నమోదుతో మనకి,భవిష్యత్తు తరాలకు జరగబోయే అభివృద్ధికోసం వివరించారు.నియోజకవర్గంలో నాయకులతో కలిసి పాదాచారులకు, ఇంటింటికి వెళ్లి బీజేపీ సభ్యత్వ నమోదు వలన కలిగే ప్రయోజనాలు వివరించి సభ్యత్వం నమోదు చేపట్టారు.ఈ సందర్భంగా ప్రముఖ్ గంకల కవిత అప్పారావు మాట్లాడుతూ ఉత్తర నియోజకవర్గంలో నియోజకవర్గం శాసన సభ్యులు విష్ణు కుమార్ రాజు ఆదేశాలు మేరకు నియోజకవర్గం ఇంచార్జి సురేష్ బాబు ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వం నమోదు జోరుగా సాగుతుందని,సభ్యత్వం నమోదుపై ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుందని బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం భాగమని,ఈ కార్యక్రమం ఇంటింటికి తిరిగి ప్రజలను సభ్యత్వం నమోదు చేయించడమే కాకుండా,పార్టీకి నూతన వర్గాల్ని చేర్చడంలో కీలకంగా మారిందని,ఈ కార్యక్రమం బీజేపీని స్థానిక స్థాయిలో బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తోందని,ఉత్తర నియోజకవర్గంలో ఈ కార్యక్రమానికి మంచి స్పందన ఇస్తున్నారని,బీజేపీ బలోపేతం కోసం సంస్థాగత చొరవలు తీసుకుంటున్నామని,బీజేపీ సంస్థాగతంగా బలోపేతం చేయడానికి చేపట్టిన ఈ సభ్యత్వ కార్యక్రమం ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. పార్టీ కార్యకర్తలు, నాయకులు ఒకటిగా పనిచేస్తూ, బీజేపీ ఆదర్శాలను గ్రామస్థులకు వివరించారు. రాష్ట్రంలో ఇస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో కేంద్రంలో ఉన్న బీజేపీ హస్తంతోనే నడుస్తుందని,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరుపున పెద్ద ఎత్తున్న బీజేపీ పార్టీకి మద్దతుగా ఉండి కేంద్రం సహకారం పొందెందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గం సహా ప్రముఖ్ రాంబాబు,యువ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు ఉప్పులు వంశీ,విశాఖపట్నం పార్లమెంటరీ ఇంచార్జ్ పుట్ట గంగయ్య,యువ మోర్చా పార్లమెంటరీ అధ్యక్షులు ధోని నాగరాజు,ఎస్సీ మోర్చా పార్లమెంటరీ అధ్యక్షులు రాకేష్, విశాఖ జిల్లా బిజెపి జనరల్ సెక్రెటరీ దానేష్,యువ మోర్చాసీనియర్ నాయకులు దిలీప్ రాజు,ఎస్ సి మోర్చా బీజేపీ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు బండా పోతురాజు,ఎస్ టి మోర్చా పూజారి ఆశీర్వాదం తదితర ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

# తెలుగు తేజం స్ఫూర్తి స్వాతంత్ర్య దీప్తి అల్లూరి

**మన్యం ధీరుడు సినిమా అద్భుతంగా ఉంది**

**నటించి తీసిన సత్య నారాయణ అభినందనీయులు**

**నాటి మహనీయ కథను నేటి తరానికి అందించాలి బి.వి.రామ్ గొప్ప సంకల్పం చేయడం అభినందనీయం**

**రెండు గంటల మన్యం ధీరుడు సహజంగా నాటి పరిస్థితులకు అద్దం పట్టింది**

**అందరూ చూడాలి ఈ మన్యం ధీరుడు ప్రోత్సహించాలి**

**మాజీ కేంద్ర మంత్రి సినీ మెగా నిర్మాత టి.సుబ్బరామిరెడ్డి**



జనసముద్రం న్యూస్, విశాఖపట్నం,సెప్టెంబర్22

ఆర్.వి.వి.సత్య నారాయణ నిర్మాతగా మారి అల్లూరి సీతారామరాజు గా నటించి తీసిన మన్యం ధీరుడు సినిమా గొప్పగా ఉందని మెగా సినీ నిర్మాత, పూర్వ కేంద్ర మంత్రి టి.సుబ్బరామిరెడ్డి అన్నారు. నాటి స్వాతంత్ర్య పోరాటం లో తన జీవితాన్ని త్యాగం చేసిన అల్లూరి ఆ నేపథ్యంలో గిరిజన, సామాన్య ప్రజల జీవితాలకు వెలుగు దిక్సూచి అయ్యి వారిలో స్వాతంత్ర్య కాంక్షను పెంచి చేసిన అల్లూరి జీవితాన్ని చాల సహజంగా తెరకెక్కించారని ప్రశంసించారు. ఈ గొప్ప సినిమాను ఈ తరానికి చేరువ చేయాలనే తలంపుతో తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ కంకణం కట్టుకున్న ప్రయత్నిస్తున్న తీరు తనను ముగ్దున్ని చేసిందన్నారు. హైదరాబాద్ ప్రసాద్ కలర్ ల్యాబ్ లో మన్యం ధీరుడు ఆర్.వి.వి.సత్యనారాయణ, బి.వి.రామ్ లతో కలసి సినిమా చూసిన అనంతరం కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి తన భావాలను పంచుకున్నారు. నాటి స్వాతంత్ర్య పోరాటం లో ప్రాణాలను తృణ ప్రాయంగా భావించి దారబోసిన మహనీయుల్లో అల్లూరి సీతారామరాజు గొప్ప స్ఫూర్తి ప్రదాత అన్నారు. అలాంటి మహనీయుని జీవితాన్ని సినిమాటిక్ గా కాకుండా చాల సహజంగా దృశ్యీకరించిన తీరు అద్భుతంగా ఉంది అన్నారు. మన్యం ధీరుడు లోని ధీరత్వాన్ని పోరాట నైజాన్ని బ్రిటిషర్ల ను గడగడలాడించి వారి వెన్నులో వణుకు పుట్టించిన తీరు ఆవిష్కారం బాగుందన్నారు. గిరిజన తండాల్లో అంతర్లీనంగా ఉన్న మద్యం అలవాటు మొదలు కరువైన వైద్యం కు ఆయుర్వేద వైద్యం స్వయంగా అందించి వారిని అక్షరాస్యులు అయ్యి చైతన్యం తెచ్చుకుని స్వాతంత్ర్య పోరాట దీప్తి కి అంకితమయ్యేలా సిద్ధం చేసిన అల్లూరి ఘనతను ఈ తరానికి రేపటి తరానికి చక్కగా అందించారన్నారు. ఈ గొప్ప సినిమాను అంతే గొప్పగా తెరకెక్కించిన నటించి మెప్పించిన ఆర్.వి.వి.సత్య నారాయణ అభినందనీయులు అన్నారు. ఈ మన్యం ధీరుడు సినిమా ప్రతి ఒక్కరికీ చేరువ చేసి ఈ ప్రాంత తెలుగు శక్తి తేజం మన అల్లూరి సీతారామరాజు జీవితాన్ని అందరికీ తెలిసేలా చేయాలని కంకణం కట్టుకున్న తెలుగు శక్తి అధినేత బి వి రామ్ గొప్ప సంకల్పం చేయడం అభినందనీయం అన్నారు.బి.వి.రామ్ ఏది అనుకున్నా ఇదే పట్టుదలతో ప్రయత్నం చేస్తారని అందుకు నిదర్శనమే ప్రసాద్ ల్యాబ్ లో నేను మన్యం ధీరుడు సినిమా చూడడం అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలుగు శక్తి అధినేత బి.వి.రామ్ మాట్లాడుతూ ప్రతి భారతీయుడు మన్యం ధీరుడు సినిమా చూసి తెలుగు తేజం అల్లూరి సీతారామ రాజు స్వాతంత్ర్య పటిమ వాస్తవ జీవితం పదిలంగా హృదయాల్లో నిక్షిప్తం చేసుకోవాలన్నదే తన ధ్యేయం అన్నారు.

# టీటీడీ లడ్డూపై చంద్రబాబు వ్యాఖ్యలు దారుణం

**ఆరోపణలపై సీబీఐ లేదా న్యాయవిచారణ చేయాలి**

**:మండలి విపక్షనేత బొత్స సత్యనారాయణ డిమాండ్**



జనసముద్రంన్యూస్,విశాఖపట్నం, సెప్టెంబర్ 21 విశాఖపట్నంలోని క్యాంప్ ఆఫీస్‌లో మీడియాతో మాట్లాడిన శాసనమండలి విపక్షనేత, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ. టీటీడీ లడ్డూలో కల్తీ నెయ్యి అంటూ చంద్రబాబు ఆరోపణముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి అలా మాట్లాడడం తగదు కోట్లాది ప్రజల మనోభావాలతో రాజకీయం సరి కాదునిజాలు నిగ్గు తేల్చిన తర్వాత మాట్లాడితే బాగుండేది:తేల్చి చెప్పిన బొత్స సత్యనారాయణ లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగితే వెంటనే విచారణ జరపాలినిజాలు నిర్ధారించి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలితప్పు జరగలేదని తేలితే బాబు ప్రజలకు క్షమాపణ చెప్పాలిరాజకీయ వేదికపై టీటీడీ లడ్డూ ప్రసాదం ప్రస్తావనసీఎం మాటలు అసంబద్ధం. బాధ్యతా రాహిత్యం100 రోజుల పాలనలో పూర్తిగా విఫలమైన ప్రభుత్వంహామీల డైవర్షన్ కోసమే దేవుడితో రాజకీయాలు:ప్రెస్‌మీట్‌లో మండలి విపక్షనేత స్పష్టీకరణ విశాఖపట్నం:ఎన్డీఏ సమావేశంలో సీఎం చంద్రబాబు, టీటీడీ లడ్డూను ప్రస్తావించడం, ఆ ప్రసాదం తయారీలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపించడంపై శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. సీఎం స్థాయిలో ఉన్న వ్యక్తి అలా మాట్లాడ్డం దురదృష్టకరమన్న ఆయన, సభ్య సమాజంలో ప్రజలతో ఎన్నుకోబడ్డ ప్రభుత్వాలు.. ప్రజల మనోభావాలతో రాజకీయాలు చేయడం స్రరి కాదని స్పష్టం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా ఆరాధ్య దైవంగా పూజలందుకుంటున్న శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని, నైవేద్యంలో నాణ్యత లేని పదార్థాలు వాడారన్న సీఎం ఆరోపణలు మీడియాలోనూ, సోషల్ మీడియాలోనూ తీవ్ర దుమారాన్ని రేపాయని గుర్తు చేశారు. అధికారంలో ఉన్న వ్యక్తులు ఇలా ఆరోపణ చేసే బదులు, వాటిపై విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చి.. అప్పుడు మాట్లాడితే బాగుండేదని తేల్చి చెప్పారు. అందుకే ఆ ఆరోపణలపై సీబీఐ లేదా న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. చట్టాల్లో లొసుగులు ఆసరాగా చేసుకుని చట్టానికి అతీతంగా ప్రవర్తించినట్లు.. దేవుడితో అలాంటి రాజకీయాలు చేస్తే కచ్చితంగా ఫలితం అనుభవిస్తారని బొత్స హెచ్చరించారు. ఏ మతం, ఏ కులమైనా ప్రతి ఒక్కరికీ మనస్సాక్షి ఉంటుందని.. తప్పు చేస్తే కచ్చితంగా శిక్ష తప్పదన్న ఆయన, ఇప్పటికైనా పత్రికలు, పార్టీలు ఈ వివాదానికి ముగింపు పలకాలని విజ్ఞప్తి చేశారు. ప్రసాదాలకు వాడే పదార్థాల నాణ్యతను పరీక్షించిన తర్వాత, అవి ప్రమాణాలకు అనుగుణంగా ఉంటేనే అనుమతించడం లేకపోతే తిరస్కరించడం టీటీడీ ఆనవాయితీ అని మండలి విపక్షనేత గుర్తు చేశారు. అలా వైయస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో 18 ట్యాంకర్లు, అంతకు ముందు చంద్రబాబు హయంలో 14 ట్యాంకర్లను వెనక్కు పంపారని తెలిపారు. సందర్భం లేకుండా ఆ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఇంత వివాదం చేస్తూ.. ప్రజల మనోభావాలను ఎందుకు గాయపరుస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీశారు. తమ 100 రోజుల పాలనలో ఏం చేశామో చెప్పడం లేదా రాష్ట్రాభివృద్ధిపై మాట్లాడకుండా, గత తమ ప్రభుత్వంపై బురద చల్లడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల అమలు సంగతి అటుంటి.. కనీసం గతంలో అమలైన అమ్మఒడి, రైతుభరోసా లాంటి ఆన్ గోయింగ్ స్కీమ్స్ అయినా ఇవ్వాలి కదా అని నిలదీశారు. ఎన్నికల హామీలు ఎప్పుడు అమలు చేస్తారో చెప్పాలన్న బొత్స, హామీల డైవర్షన్ కోసం ఇలాంటి నీచ రాజకీయాలు చేయడం సరి కాదన్నారు. విజయవాడ వరదల్లో ప్రభుత్వ వైఫల్యంతో ప్రాణాలు కోల్పోయిన వారు, ఆకలితో తిండి లేక అలమటించిన వారెంత మందో లెక్కలు చెప్పాలని అడిగితే.. బోట్లతో ప్రకాశం బ్యారేజీని కూల్చే కుట్ర చేశారంటూ డైవర్షన్ పాలిటిక్స్ చేయడం శోచనీయమని మండలి విపక్షనేత అన్నారు. ఆ బోట్లు వరదలో ఎలా కొట్టుకొచ్చాయో మీ మనస్సాక్షికి తెలియదా? అని ప్రభుత్వాన్ని నిలదీసిన బొత్స.. కొండపై కొలువున్న కనకదుర్గమ్మకు అన్ని వాస్తవాలు తెలుసన్నారు. 35 ఏళ్ల రాజకీయ జీవితంలో వరదల్లో ప్రజలు చనిపోయిన సందర్భాలు చూశాను కానీ.. ఇలా ప్రభుత్వ అసమర్థత వల్ల మూడు రోజుల పాటు నీటిలో ఉండిపోయి తాగు నీళ్లు, తిండి లేక ఇంత మంది చనిపోయిన పరిస్థితులెక్కడా చూడలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అదీ రాష్ట్రం నడిబొడ్డున జరగడం మరింత శోచనీయమని తేల్చి చెప్పారు. టీటీడీ లడ్డూ తయారీలో కల్తీ నెయ్యికి అవకాశం లేదన్న మాజీ సీఎస్ ఐవైఆర్ కృష్ణారావు మాటలతో ఏకీభవిస్తున్నట్లు బొత్స వెల్లడించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే తక్షణమే విచారణ చేసి నిజాలు నిగ్గు తేల్చాలని.. కల్తీ జరిగినట్లు విచారణలో తేలితే నిందితులను శిక్షించాలన్నారు. లేని పక్షంలో సీఎం చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పాలని మండలి విపక్షనేత డిమాండ్ చేశారు.

# నవులూరి వారి వస్త్రాలంకరణ కార్యక్రమానికి విచ్చేసిన యాగంటి

జనసముద్రంన్యూస్, సెప్టెంబర్ 22, పల్నాడు జిల్లా, మాచర్ల, గురజాల.మాచర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు యాగంటి మల్లిఖార్జునరావు ఆదివారం గురజాల లో జరిగిన నవులూరి వారి వస్త్రాల అలంకరణ కార్యక్రమానికి విచ్చేసి చిన్నారులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో యాగంటి వెంట పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





## దిగువ అబ్బవరం గ్రామంలో నీటి సమస్య పరిష్కరిస్తాం

## రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాజంపేట, జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ ,22

రాయచోటి మండలం, దిగువ అబ్బవరం గ్రామంలో నీటి సమస్య అధికంగా ఉందని ఆదివారం ఆ గ్రామానికి చెందిన పలువురు మహిళలు మంత్రివర్యుల దృష్టికి తెచ్చారు. నీటి సమస్యపై వెంటనే స్పందించిన మంత్రివర్యులు అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి దిగువ అబ్బవరం గ్రామంలో నీటి ఎద్దడి అధికంగా ఉందని ఈ సమస్యను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రివర్యులు ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు సూచించడం జరిగింది. దీంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.



## పెద్దమ్మ తల్లి ని దర్శించుకున్న ఆర్ ఆర్ రమేష్ దంపతులు

జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 22 ( పామిడి రూరల్ )

అనంతపురం జిల్లా, పామిడి మండలం, గుంతకల్లు నియోజకవర్గం, శాసన సభ్యులు గుమ్మనూరు జయరాం మరియు ఆయన తనయుడు పామిడి ఇంచార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు పామిడి మండల స్థానిక నాయకుడు, సమన్వయ కర్త ఆర్ ఆర్ రమేష్ పామిడి మండలం, ఓబులాపురం గ్రామం లో పర్యటించి పలు సమస్యలను గ్రామస్తులను అడిగి తెలుసుకుని గ్రామం లో ప్రసిద్ధిగాంచిన పురాతన ఆలయం. దొడ్డ ఓబులేసు స్వామి ఆలయాన్ని సతీ సమేతంగా ఆర్ ఆర్ రమేష్, సందర్శించి స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు.అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ, ఓబులాపురం గ్రామం లో మురుగునిటీ సమస్య ఎక్కువగా ఉందని అలాగే గ్రామం లో మసీదు కు కాంపౌండ్ వాల్ మరియు పెద్దమ్మ గుడికి, మారమ్మత్తులు చేయించాలని మరియు దొడ్డ ఓబులేసు స్వామి గుడికి ప్రధాన రోడ్డు నుండి రహదారి రోడ్డు నిర్మించాలని కోరగా స్పందించి ఆర్ ఆర్ రమేష్, గుమ్మనూరు ఈశ్వర్ తో చర్చించి మీ సమస్యలు పరిష్కరిస్తానని, గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఓబులాపురం మరియు దేవరపల్లి గ్రామ టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, హాజరయ్యారు.



## డ్వాక్రా సంఘాలు చంద్రబాబు మానస పుత్రిక.

జనసముద్రం న్యూస్ మాచర్ల సెప్టెంబర్ 22.

దేశంలో డ్వాక్రా సంఘాలకు ఆద్యుడు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని ఆ సంఘాలు చంద్రబాబు నాయుడు మానస పుత్రిక అని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో ని 224 మంది డ్వాక్రా సభ్యులకు మంజూరైన రూ.3.47 కోట్ల విలువగల చెక్కును ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు ఉద్దేశించి ఎమ్మెల్యే జూలకంటి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని వారిని రాజకీయంగా ఆర్థికంగా ఎదిగేందుకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని గుర్తు చేశారు. మహిళల సాధికారత తెలుగుదేశం పార్టీ హయాంలోనే సాధ్యమైంది అన్నారు.





## అంగన్వాడి సేవలను

## సద్వినియోగం చేసుకోండి : ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి

జన సముద్రం న్యూస్ మాచర్ల. సెప్టెంబరు 22.

రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల ద్వారా అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీ బాలింతలకు చిన్నారులకు అందిస్తున్న సేవలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో నిర్వహించిన పోషక మాస్ ఉత్సవాలలో భాగంగా సామూహిక సీమంతాల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక ఆహార విలువలు గల పదార్థాల గురించి వివరించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందించే సరుకులలో నాణ్యత లోపం లేకుండా చూడాలన్నారు. ఆరోగ్య కార్యకర్తలు సమన్వయం చేసుకుంటూ లబ్ధిదారులకు సేవలు అందించాలన్నారు.

# టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్ చాట్ లో చంద్రబాబు నాయుడు సంచలన వ్యాఖ్యలు

జనసముద్రంన్యూస్, సెప్టెంబర్ 22, మంగళగిరి. టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్‌లో సంచలన వ్యాఖ్యలు చేశారు సీఎం చంద్రబాబు నాయుడు.. గత ప్రభుత్వంలో దేవాలయాల్లో అనేక అపచారాలు జరిగాయి.రామతీర్థంలో రాములవారి విగ్రహం తల తొలిగిస్తే దిక్కులేదు.. కనీసం చర్యలు తీసుకోలేదు. ఇలా ఒక్కటని కాదు.. నాటి ప్రభుత్వం చెయ్యని తప్పులేదు అన్నారు.. నాటి ప్రభుత్వం ప్రజల సెంటిమెంట్లతో ఆడుకున్నారు. ప్రజల మనోభావాలకు గత ప్రభుత్వం విలువ ఇవ్వలేదు. పోలవరం, అమరావతి నాశనం చేసి.. వాటిపైనా ఎదురు దాడి చేసి తప్పుడు ప్రచారం చేశారు. బాబాయి హత్య విషయంలో ఎలా బుకాయించారో.. నేడు ప్రకాశం బ్యారేజ్ కు బోట్ల విషయంలో అలాగే మాట్లాడుతున్నారు. అందుకే వీళ్లను కొలంబియా నేరస్తుడు, మాఫియా డాన్ పాబ్లో ఎస్కోబార్ తో పోల్చాను అన్నారు..తిరుమల శ్రీవారి ప్రసాదం విషయంలో ఎన్డీడీబీ రిపోర్ట్ ఇస్తే దానిపై సమాధానం చెప్పకుండా.. బుకాయించే వాళ్లను ఏమనాలి? అని నిలదీశారు చంద్రబాబు.. రూ. 320 కిలో ఆవు నెయ్యి ఎలా వస్తుంది..? శ్రీవారికి నైవేద్యంగా పెట్టే లడ్డూ తయారీలో రివర్స్ టెండర్లు ఏంటి? పరమ పవిత్ర పుణ్యక్షేత్రం విషయంలో ఒళ్లు దగ్గర పెట్టుకోవాలి కదా! తప్పు చేసింది కాక.. ఇది డైవర్షన్ పాలిటిక్స్ అని సిగ్గు లేకుండా ఎలా చెపుతారు..? అంటూ ఫైర్ అయ్యారు.. ప్రభుత్వం మారిన వెంటనే తిరుమల ప్రక్షాళన చేయమని కొత్త ఈవోకు చెప్పాను.. ఆయన అనేక చర్యలు తీసుకున్నారు. లడ్డూ నాణ్యత పెంచారు. పలు కంపెనీలను బ్లాక్ లిస్టులో పెట్టారు. లడ్డూ నాణ్యత కోసం నందిని నుంచి నెయ్యి కొనుగోలు చేశారు. ఈవో ప్రక్షాళన చేశారు.. కానీ ఇవన్నీ రోజూ బయటకు వచ్చి చెప్పలేదు. పని చేసుకుంటూ పోయాడు. ఇప్పుడు ఆ ఏడుకొండల వాడే నాతో లడ్డూ వ్యవహారంపై మాట్లాడించాడేమో! ఆ దేవుడే నా నోటినుంచి నిజాలు చెప్పించాడేమో..? మనం నిమిత్త మాత్రులం. దేవుడే అన్నీ చేయిస్తాడు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు చంద్రబాబు..ఇక, టీటీడీ విషయంలో తదుపరి ఏం చెయ్యాలి.. ఎలా చెయ్యాలి అనేది చర్చిస్తున్నాం అన్నారు సీఎం చంద్రబాబు.. జీయర్లు, కంచి పీఠాధిపతులు, సనాతన ధర్మ పండితులతో చర్చించి సంప్రోక్షణ ఎలా ఉండాలో నిర్ణయిస్తాం. ఇప్పటికే ఆ దిశగా ఆలోచనలు చేస్తున్నాం అన్నారు.. అయితే, వైవీ సుబ్బారెడ్డికి జగన్ ఎలా సర్టిఫికెట్ ఇస్తారు? అని ప్రశ్నించారు.. తిరుమలలో ఏం సంప్రదాయాలను వీళ్లు



పాటించారు. తిరుమల సెట్ ఇంట్లో వేసుకున్నవాడిని ఏమనాలి? కేరళ గురవాయూర్ టెంపుల్ లో చొక్కా విప్పి వెళ్లాలి.. అది సాంప్రదాయం. అందరూ పాటించాలి. ప్రతి మతానికి కొన్ని ఆచారాలు, సాంప్రదాయాలు ఉన్నాయి.. వాటిని ప్రతి ఒక్కరు గౌరవించాలి. శ్రీవారి లడ్డూ కంటే బాగా చేయాలని చాలా మంది ప్రయత్నం చేశారు.. కానీ, సాధ్యం కాలేదు. 1817 నుంచి శ్రీవారి లడ్డూ అక్కడ తయారు అవుతోంది. ఆయోధ్యలో కూడా తిరుమల లాంటి లడ్డూ తయారు చేయాలని చూశారు. కానీ, సాధ్యం కాలేదు. రోజూ మూడు సార్లు పరీక్షలు చేశాం అని ఎవరిని మభ్యపెడుతున్నారు. గతంలో వైఎస్ ఏడు కొండలను రెండు అన్నాడు.. అప్పుడు వ్యతిరేకించాం.. పోరాడాం.. అమరావతితో రూ. 250 కోట్లతో శ్రీవారి టెంపుల్ కడదాం అనుకుంటే దాన్ని కుదించారు అని ఆవేదన వ్యక్తం చేశారు.. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో పరీక్షలు, సంప్రోక్షణ కార్యక్రమాలు చేపడతాం. వరద బాధితులకు వేగంగా సాయం అందేలా చేస్తాం. మానవీయ కోణంలో సాయం అందిస్తున్నాం అని మీడియా చిట్‌చాట్‌లో ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# సంక్షేమం, యువతకు ఉపాధే తమ ప్రభుత్వం లక్ష్యం : జూలకంటి బ్రహ్మారెడ్డి

జనసముద్రంన్యూస్, సెప్టెంబర్ 22, పల్నాడు జిల్లా, మాచర్ల మండలం. సంక్షేమం యువతకు ఉపాధి కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి 100రోజులు అయిన సందర్భంగా మాచర్ల మండలం లోని జమ్మల మడక గ్రామంలో “ఇది మంచి ప్రభుత్వం” అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. సామాజిక పెన్షన్లను రూ.75, రూ.1000, రూ. 2000, రూ.4,000లకు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రివర్స్ టెండర్రింగ్ పేరుతో అన్ని రంగాలలో తిరుగమనంలో పయనించేలా చేసిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవించే లక్షలాదిమంది రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రభుత్వం ఇసుక పై నూతన పాలసీ రూపొందించి భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే బడుగుల జీవితాలలో వెలుగులు నింపిందని అన్నారు. రాబోవు దీపావళి నుండి ఎన్నికలలో ఇచ్చిన హామీలలో భాగంగా ఉచిత సిలిండర్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ఆర్థిక వ్యవస్థ పై భారం ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను



నెరవేర్చుటంలో ఎక్కడా రాజీ పడబోమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నేరెళ్ల వీరాస్వామి, సాతులూరి కుమార్, గుండాల శ్రీనివాసరావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు వజ్రం నాయక్, గుత్తికొండ సత్యనారాయణ రెడ్డి కూరాకుల కోటేశ్వరరావు అధికారులు ఎండిఓ సరోజినీ దేవి, బి ఎల్ డివో గబ్రు నాయక్ ,ఏఈపిఆర్ సత్యనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ నాయక్, ఎంఈఓ అల్లి సురేష్, ఏపీవో నాగ శ్రీను, డిటి శ్రీనివాసరావు, వెలుగు దాసు మరియు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ ఫంక్షన్ లో.... “విక్టరీ స్కూల్ నర్సింహారెడ్డి”... ఘనంగా సన్మానించడం

## పిల్లలకు నేర్పిస్తున్న క్రమశిక్షణ, సాంస్కృతిక కార్యక్రమాలు, విద్య బోధనలో... వైస్ ఛాన్సర్ శేఖర్ వారి.. చేతుల మీదుగా సన్మానం

అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ సెప్టెంబర్ 21 జనసముద్రం న్యూస్ తిరుపతి పట్టణంలోని సాంస్కృతిక విద్యాపీఠం వారి ఆడిటోరియం నందు జరిగినటువంటి జిల్లాస్థాయి ప్రైవేటు పాఠశాలల వార్షిక సమావేశం సందర్భంగా జరిగినటువంటి జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల ఫంక్షన్ నందు ముఖ్యఅతిథిగా పాల్గొన్నటువంటి రాష్ట్ర ప్రైవేటు పాఠశాలలు ఉపాధ్యక్షులు అయినటువంటి నరసింహారెడ్డి ని ఘనంగా సన్మానించడమైనది. ఈ కార్యక్రమంలో డీఈవో శేఖర్ , విద్యాపీఠం వైస్ ఛాన్సర్ శేఖర్ , మరియు డాక్టర్ విశ్వనాథ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ప్రైవేటు పాఠశాల అభ్యున్నతికి మరియు ప్రైవేటు పాఠశాలలు ఎదుర్కొన్నటువంటి సమస్యలను రాష్ట్రస్థాయిలో పరిష్కరించడానికి చేస్తున్నటువంటి కృషికి గుర్తింపుగా విక్టరీ నరసింహారెడ్డిని సన్మానించడం మాకెంతో గర్వకారణం అని వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సన్మానం నా బాధ్యతను మరింత పెంచిందని , భవిష్యత్తులో నా శక్తి కొలది ప్రైవేటు పాఠశాల ఉన్నతికి కృషి చేస్తానని నరసింహారెడ్డి తెలియపరచి చెప్పుకొచ్చారు.





# మంత్రి గారి చొరవతో సత్వరం తాగునీటి సమస్య పరిష్కారం

లక్కిరెడ్డిపల్లె రాయచోటి నియోజకవర్గం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 22 లక్కిరెడ్డి పల్లి టౌన్ నందు గత కొంతకాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడం తో గ్రామస్తులు ఈ విషయాన్ని రవాణా , యువజన, క్రీడా శాఖ మంత్రి గౌరవనీయులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గారి దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించిన మంత్రి ప్రత్యేక నిధులు తో ఆ గ్రామానికి శనివారం బోరు వేయించడం జరిగింది ,మంత్రి రాంప్రసాద్ రెడ్డి గారి సోదరులు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు, డాక్టర్ శ్రీ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి గారు గత వారంటౌన్ పర్యటనలో భాగంగా డాక్టర్ దృష్టికి రావడమో తో అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మొదటి విడత నీటి సమస్య అధికంగా ఉన్న గ్రామాలను గుర్తించి ఆ గ్రామాలకు మంత్రి చొరవతో నియోజకవర్గ వ్యాప్తంగా బోర్లు వేయించి నీటి ఎద్దడిని పరిష్కారం చేయడం జరుగుతుందని ఆయన అన్నారు . ఈ కార్యక్రమం రాజంపేట డాక్టర్ సెల్ కార్యదర్శి షఫీ నాయక్,ఆధ్వర్యంలో బోర్ వేయించడం జరిగింది



# అంగన్వాడి సెంటర్ ను ఆక్రమించిన వైసిపి నాయకుడు

లక్కిరెడ్డిపల్లి రాయచోటి నియోజకవర్గం

జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 22 రామాపురం మండలం చిట్లూరు గ్రామం చెరువు ముందర పల్లెలో అంగన్వాడి సెంటర్ ను ఆక్రమించు కొని తన వ్యక్తిగతకార్యక్రమాలు, పశు వులు కట్టవేయడం కుటుంబం అక్కడే అక్కడే నివసిస్తుం డడం ఆదిరెడ్డి అనే వైసిపి నాయకుడు ఈ విషయం గత నెలల వార్తా పత్రికల్లో, సోషల్ మీడియాలో వచ్చినప్పటికీ అధికారులు ఎటువంటి చర్య తీసుకోకపోవడం సోషనీయం అధికారులు ఇప్పటికైనా మేల్కొని తగిన చర్యలు తీసుకో వాల్సిందిగా కోరుతున్నాను ప్రజలు కోరుతున్నారు



# సంక్షేమం యువతకు ఉపాధి తమ ప్రభుత్వం లక్ష్య : జూలకంటి బ్రహ్మారెడ్డి

జనసముద్రం న్యూస్ మాచర్ల సెప్టెంబర్ 22.

సంక్షేమం యువతకు ఉపాధి కల్పనే తమ ప్రభుత్వ లక్ష్యమని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. ఆదివారం మాచర్ల మండల పరిధిలోని జమ్మలమడక గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత అమలు చేసిన పథకాల గురించి ప్రజలకు వివరించారు. సామాజిక పెన్షన్లను రూ.75, రూ.1000, రూ. 2000, రూ.4,000లకు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీకి దక్కుతుందని అన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని రివర్స్ టెండర్రింగ్ పేరుతో అన్ని రంగాలలో తిరుగమనంలో పయనించిందన్నారు. గత ప్రభుత్వ హయాంలో భవన నిర్మాణరంగంపై ఆధారపడి జీవించే లక్షలాదిమంది రోడ్డున పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు తమ ప్రభుత్వం ఇసుకపై నూతన పాలసీ రూపొందించి భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవించే బడుగుల జీవితాలలో వెలుగులు నింపిందని అన్నారు రాబోవు దీపావళి నుండి ఎన్నికలలో ఇచ్చిన హామీలను భాగంగా ఉచిత సిలిండర్ పథకాన్ని అమలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల కారణంగా ఆర్థిక వ్యవస్థ పై భారం ఉన్నప్పటికీ ఇచ్చిన హామీలను నెరవేర్చుటంలో ఎక్కడా రాజీ పడబోమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు నేరెళ్ల వీరస్వామి సాతులూరి కుమార్ గుండాల శ్రీనివాసరావు వజ్రం నాయక్ గుత్తికొండ సత్యనారాయణ రెడ్డి కూరాకుల కోటేశ్వరరావు అధికారులు సరోజినీ దేవి గబ్రు నాయక్ సత్యనారాయణ నాయక్ కోటేశ్వరరావు సురేష్ నాగ శ్రీను శ్రీనివాసరావు వెలుగు దాసు అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.



# ప్రమాద బారిన పడిన పేద కుటుంబానికి బీపీ నాయక్ ఆర్థిక చేయూత

బోనకల్, ఖమ్మంజిల్లా, మధిర నియోజకవర్గం, జనసముద్రం న్యూస్, శనివారం, సెప్టెంబర్ 22:- స్థానిక మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో ఇటీవల ప్రమాదానికి గురైన బాదావత్ సైదులు కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు బీపీ నాయక్. ఈ సందర్భంగా బీపీ నాయక్ మాట్లాడుతూ... ప్రమాదంలో సైదులు కంటికి గాయాలవ్వడం, కొంతమేరకు చూపు మందగించడం దురదృష్టకరమని, త్వరగా పూర్తిగా కోలుకోవాలని, వారి కుటుంబానికి ఐదువేల రూపాయలు తక్షణ ఆర్థిక సహాయాన్ని అందించారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తన కంటి చికిత్సకు తప్పకుండా సహకరిస్తామని భరోసా ఇచ్చారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ సైదా నాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు గాలి దుర్గారావు, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు భూక్యా భద్రు నాయక్, నాయకులు సురేష్, సూర్య, సుమన్, గోపి, తరుణ్, గోపి, ఉపేందర్ తదితర నాయకులు కార్యకర్తలు, యువజన సంఘ నాయకులు పాల్గొన్నారు.



# సిపిఎం బోనకల్ గ్రామ నూతన కార్యదర్శిగా ఉప్పర

బొనకల్, మధిర నియోజకవర్గం, ఖమ్మంజిల్లా, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 22:- బోనకల్ సిపిఎం గ్రామ మహాసభ ఆదివారం కామ్రేడ్ సీతారాంఏచూరి ప్రాంగణం నందు తెల్లాకుల శ్రీనివాస్ ఇంటి వద్ద జరిగినది. మహాసభ ప్రారంభ సూచికంగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు బిల్లా విశ్వనాథం ఎగరవేశారు. పార్టీ మహా నాయకులకు సభ సంతాపం తెలియజేసి నివాళులర్పించారు. భూక్య జాలు అధ్యక్షతన జరిగిన మహాసభలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరావు మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గారెంటీలను చెప్పిన వంద రోజులలో అమలు చేయలేక పోయారని, అర్హులందరికీ రేషన్ కార్డ్స్ ఇవ్వకుండా రుణమాఫీకి కార్డు ప్రామాణికం పెట్టడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరావు మాట్లాడుతూ... కేంద్రం ప్రజల మధ్య మత విద్వేషాలు రెచ్చగొడుతుందని ఇది దేశనికి ప్రమాదమని హితం పలికారు. కార్యదర్శి తెల్లాకుల శ్రీనివాస్ గత మూడు సంవత్సరాల కార్యక్రమాలను చదివి వినిపించారు. అనంతరం మహాసభ నూతనకార్యదర్శిగా ఉప్పర శ్రీను ని ఏకగ్రీవంగా ఎన్నుకొన్నది. ఈ సభలో మండలకమిటీ సభ్యులు గుగులోతు పంతు, బంధం శ్రీనివాస్, శ్రీనివాస్, పిల్లలమర్రి అప్పారావు, కిలారు సురేష్, కూచిపూడి మురళి పాల్గొన్నారు.



# బాధితులకు ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి.

జన సముద్రం న్యూస్ మాచర్ల. సెప్టెంబర్ 22. మాచర్ల పట్టణంలోని జయంతి నగర్ లోని ఎందేటి అంకమ్మ గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తగలబడటంతో విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆ కుటుంబానికి నిత్యావసర సరుకులు, బియ్యం 5000 నగదు అందజేశారు. ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రభుత్వ తరపు సహకారం అందించాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమం పట్టణ అధ్యక్షుడు కొమ్మెర దుర్గారావు జూలకంటి అక్కిరెడ్డి వజ్రం నాయక్ బాబు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# జంగయ్య మృతి బాధాకరం ప్రగాఢ సంతపాన్ని తెలియజేసిన ఎమ్మెల్యే

సెప్టెంబర్ 22 (జనసముద్రంన్యూస్ చింతపల్లి). అకాలం వర్షం కారణంగా పిడుగు పాటుకు మృతి చెందిన యాచారం జంగయ్య మృతి బాధాకరమని దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం చింతపల్లి మండలంలోని వింజమూరు గ్రామానికి చెందిన యాచారం జంగయ్య మృతి పట్ల ప్రగాఢమైన సంతాపాన్ని తెలియ జేశారు. ఆయన కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున ఆదుకుంటామన్నారు ఎమ్మెల్యే వెంట మం డల పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణ్, కాంగ్రెస్ జిల్లా నాయకులు దొంతం సంజీవ రెడ్డి, ఎరుకలి వెంకటయ్య గౌడ్, మాజీ వైస్ ఎంపీపీయాచారం యాదయ్య గౌడ్,కాంగ్రెస్ కార్య కర్తలు అభిమానులు తదితరులున్నారు.



## మళ్లీ పెళ్లిలో మండిపల్లి, సుగువాసి, గడికోట

లక్కిరెడ్డిపల్లె రాయచోటి నియోజకవర్గం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 23:లక్కిరెడ్డిపల్లె మండలం ఎర్రగుడి గ్రామంలో టిడిపి నాయకులు వెంకటరమణ గారి కుమారుడి మల్లిపెళ్లి కార్యక్రమానికి రాష్ట్ర రవాణా, యువజన క్రీడ శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, మాజీ టిటిడి బోర్డు మెంబర్ సువాసి ప్రసాద్ బాబు, మాజీ ఎమ్మెల్యే గడికోట ద్వారకనాథ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి విందు కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి, మాజీ ఏపీ ఏఐసి చైర్మన్ తోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపిటిసి లక్కిరెడ్డిపల్లి టిడిపి యువ నాయకుడు యనమల మదన్ మోహన్, రాజంపేట తెలుగు యువత అధ్యక్షుడు తోపిరెడ్డి నవీన్ రెడ్డి, రాజంపేట పార్లమెంట్ డాక్టర్ సెల్ కార్యదర్శి షఫీ నాయక్, కావాలి ఆంజనే యులు, నగుబోతు భాస్కర్ టీచర్ వెంకటేశ్వర్లు యనమల విశ్వనాథ్, గంటా వెంకటకృష్ణ, కటవమీద ఆంజనేయులు, మసూద్, టిడిపినాయకులు, కార్యకర్తలు , నాగుబోతు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఆ రాముడికేవిధంగానూ తీసిపోడు... ఈ 'జానకిరామ్'

### - సహనానికి నిదర్శనంగా... వినియోగదారుడికి అండగా



జన సముద్రం న్యూస్, సెప్టెంబర్ 22 (భద్రాచలం): ప్రజల సంక్షేమం కోసం వారి మాటకు విలువ ఇచ్చి రాజుగా ఎక్కడా ధర్మం తప్పకుండా మనిషి అనేవాడు ఇలా జీవించాలని చూపించాడు శ్రీరాముడు. ఆ రామునికి ఏమాత్రం తీసిపోని విధంగా సహనానికి నిదర్శనంగా, హంగూ, ఆర్భాటాలకు దూరంగా ఈ 'జానకిరాముడు' నిలుస్తున్నారంటే అతిశయోక్తి కాదు. భద్రాచలం పట్టణంలో వేల కుటుంబాలకు, వ్యాపార సముదాయాలకు వంట గ్యాస్ను సరఫరా చేస్తూ, ఎన్నో ఒత్తిళ్ళు, సవాళ్లను సైతం చిరునవ్వు చెదరకుండా పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్న భద్రాచలం పట్టణంలోని ఏఎస్ఆర్ కాలనీలోగల 'భద్రాద్రి గ్యాస్ కంపెనీ' యజమాని 'డి. జానకిరామ్' గురించి 'జన సముద్రం న్యూస్' ప్రత్యేక కథనం... ఇంట్లో ఒక రోజు వంట గ్యాస్ అయిపోతేనే కుటుంబంలో అంతర్యుద్ధాలు మొదలవుతాయి. ఏ పని కోసమైనా... ఏ ఒక్కరు ముందుకు కదలాలన్నా ముందు ఆత్మారాముడిని చల్లభరిస్తేనే అది సాధ్యమవుతుంది. అంటే ఆకలి మంట తీరితే గానీ మనం ఏపని చేయడానికి ముందుకు కదలలేం. భద్రాచలం పట్టణంతో పాటు పరిసరాల్లోని పలు కుటుంబాలు ఆకస్మాత్తుగా ఇంట్లో వంట గ్యాస్ ఖాళీ అయితే వెంటనే గ్యాస్ కంపెనీకి ఫోన్ చేయడమో, లేక గ్యాస్ సిలిండర్ తీసుకుని సదరు గ్యాస్ కంపెనీ వద్దకో చేరుకుంటారు. రోజుకు ఎంతో మంది ఈ విధంగా తమ సమస్యతో సతమతమవుతూ వస్తున్నా వారందరికీ సమయస్ఫూర్తితో, సహనంతో కంగారు పడకుండా గ్యాస్ సిలిండర్ పంపిస్తామంటూ ఆయన వద్ద పని చేసే సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా సమయానికి సిలిండర్లను చేరవేస్తూ ఎంతో మంది సమస్యలను భద్రాద్రి గ్యాస్ కంపెనీ యజమాని జానకిరామ్ పరిష్కరిస్తున్నారడంలో ఏమాత్రం సందేహం లేదు. మరోపక్క గ్యాస్ వినియోగంపై ఎప్పటికప్పుడు వినియోగదారులకు విలువైన సూచనలు, సలహాలు అందిస్తూ తండ్రి డి.వి. అప్పారావు సారథ్యంలో భద్రాద్రి గ్యాస్ కంపెనీని జానకిరామ్ ఎటువంటి విమర్శలు, ఆరోపణలకు తావివ్వకుండా నిర్వహిస్తూ భద్రాచలం ప్రాంత ప్రజల మన్ననలు పొందుతున్నారు. మున్ముందు ఈ ప్రాంత ప్రజలకు భద్రాద్రి గ్యాస్ కంపెనీ మరిన్ని సేవలందించాలని ఈ ప్రాంత ప్రజలు, వంట గ్యాస్ వినియోగదారులు ఆకాంక్షిస్తున్నారు.

## కామన్ పెల్లి నేతకాని సంక్షేమ సంఘం

### నూతన గ్రామ అధ్యక్షునిగా :- బోర్లకుంట వెంకటేష్ నేత



జన్నారం రిపోర్టర్ జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 22

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం లోని కామన్ పల్లి నేతకాని సంక్షేమ సంఘం నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ కమిటీల ద్వారా మాత్రమే నేతకాని యువత సంగటితమవుతుందని మన జాతి సమస్యలపై చైతన్యం జరుగుతుంది.అట్టి చైతన్యం ద్వారానే నేతకాని సైనికుడు పుట్టుకొస్తారు. మన సమాజం ఉద్యమాలు ఉధృతం చేస్తారు. గ్రామంలో లేదా మండలంలో మనకంటూ ప్రత్యేక గుర్తింపు రావడమే కాకుండా నాయకులుగా గుర్తింపు పొందుతూ రాబోయే ఎలక్షన్లో సర్పంచులు గా ఎంపీటీసీలుగా జెడ్పిటిసిలుగా వివిధ పదవులలో మన సామాజిక వర్గానికి గుర్తింపు పొందడం జరుగుతుంది.రాష్ట్రంలో కొన్ని నేతకాని సంఘం రాష్ట్ర అధ్యక్షులు అని నాయకులమని చెలామని అవుతూ ఎలక్షన్ల ముందు కలెక్షన్ల కోసం కొంతమంది నేతకాని జాతి పేరు చెప్పుకొని బ్రతుకుచున్నారు. అలాంటి జాతి ద్రోహులు మళ్లీ ఎలక్షన్ల ముందే వస్తారు. కామన్ పల్లి గ్రామ కమిటీ అధ్యక్షులు: బోర్లకుంట వెంకటేష్ఉపాధ్యక్షులు : జునుగురు చంద్రశేఖర్ ప్రధాన కార్యదర్శి : కామెర రాజన్న ప్రచార కార్యదర్శి : జునుగురు గణేష్కార్యదర్శి : కామెర పోషన్న క్యాషియర్లుగా : దుర్గం రాజన్న , గడ్డి జగన్ ముఖ్య సలహాదారులు: జునుగురు వెంకటేష్ నేత, జునుగురు లచ్చున్న గార్లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు నేతకానిలు పాల్గొన్నారు.

## హెల్మెట్ పై అవగాహన

### కల్పించిన రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ యాజమాన్యం



మహబూబబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 22 మహబూబాబాద్ పట్టణ పరిధిలో ప్రసన్న వారాహి ఆటోమోటివ్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్వన్ రైడ్ బాగంగా హెల్మెట్ పై అవగాహన కల్పించి రోడ్డు భద్రతపై అవగాహన తెచ్చుకోనిరవడానికి షోరూమ్ తరుపున రైడ్ నిర్వహించడం జరిగింది కస్టమర్లు స్వచ్ఛందంగా పాల్గొన్నారు ప్రసన్న వారాహి ఆటోమోటివ్స్, రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్ – మహబూబాబాద్



## ఇప్పపువ్వు లడ్డు బాలికల రక్తహీనతను నివారిస్తుంది

### మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు

జన్నారం రిపోర్టర్ జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 22బాలికలలో రక్తహీనత నివారణకు ఇప్పపువ్వు లడ్డు ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క, ఎమ్మెల్యే బొజ్జు అన్నారు. ఆదివారం ఉట్నూరు పట్టణంలోని కేబి కాంప్లెక్స్ లో ఆశ్రమ పాఠశాలల బాలికలకు ఇప్పపువ్వు తో తయారుచేసిన లడ్డూలను పంపిణీ చేశారు. ఆశ్రమ పాఠశాలలో చదువుకునే బాలికలకు లడ్డూలను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రాజార్షి షా పాల్గొన్నారు.

## వందరోజుల కూటమి ప్రభుత్వం..!! పరిపాలన ప్రజలలో ఆనందోత్సవం

**ప్రభుత్వం ఏర్పడిన 100 రోజులకు ఇది మంచి ప్రభుత్వం అని...!!ప్రజల నుంచి విశేష స్పందన..!!, ఇంచార్జ్ ముక్కా రూపానంద రెడ్డి చెప్పుకొచ్చారు..**

**ప్రజల సమస్యలు అక్కడికక్కడే.. అర్జీల ద్వారా పరిష్కరిస్తున్న, ఇంచార్జ్ ముక్కా రూపానంద రెడ్డి, ముక్కా సాయి వికాస్ రెడ్డి ,ఎమ్మెల్యే అరవ శ్రీధర్**

**పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం,, ఎమ్మెల్యే అరవ శ్రీధర్,**

**ఘనస్వాగతం పలికిన, గ్రామ ప్రజలు, ఎన్డీఏ కుటమి నాయకులు, కార్యకర్తలు అభిమానులు.**



అన్నమయ్య జిల్లా ఇన్చార్జి న్యూస్ సెప్టెంబర్ 21 జనసముద్రం న్యూస్అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నియోజకవర్గంలోనిచిట్వేలి మండలంలో కే కందుల వారి పల్లి జడ్పీహెచ్ హై స్కూల్ నందు.. ప్రభుత్వం ఏర్పడే 100 రోజులు పూర్తయిన శుభ సందర్భంగా, ఇది మంచి ప్రభుత్వం రెండవ రోజు కార్యక్రమం నిర్వహించిన రైల్వే కోడూరు నియోజకవర్గ టిడిపి పార్టీ ఇంచార్జ్ ముక్కారూపానంద రెడ్డి , వారి తనయుడు ముక్కా సాయి వికాస్ రెడ్డి ,రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ , అనంతరం ముక్కా రూపానంద రెడ్డి కే కందులు వారి పల్లి గ్రామాన్ని దత్తతు తీసుకుంటానని మాట ఇవ్వడం జరిగింది,, గ్రామ ప్రజలు మాట్లాడుతూ.. మా గ్రామాన్ని దత్తత తీసుకున్నందుకు, ధన్యవాదాలు తెలియజేసి ముక్కా రూపానంద రెడ్డి ని, ముక్కా సాయి వికాస్ రెడ్డి ని, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కి ఘనంగా సన్మానించడం జరిగింది, ఇంచార్జ్ ముక్కా రూపానంద రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్థికంగా ఎన్నో సవాళ్లు, ఇబ్బందులు ఎదుర్కొంటూ ప్రజలు అందరికీ ప్రభుత్వ పథకాలను లబ్ధిని చేకూర్చడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తుందన్నారు, ఇది ప్రజల ప్రభుత్వం అనే ప్రజలందరికీ న్యాయం చేస్తూ ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకునేందుకు నేడు వంద రోజుల పండుగను ప్రజల మధ్య జరుపుకుంటున్నామన్నారు, గత ప్రభుత్వంలో ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న ప్రజలు కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సుఖ సంతోషాలతో జీవనం గడుపుతున్నారు, ప్రభువును ఇచ్చిన హామీలే కాకుండా సాధ్యం కానీ ఇవి కూడా అమలు చేస్తూ ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు, ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ గతంలో ఉద్యోగాలు లేక ఎంతోమంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకున్నా పరిస్థితులు ఉన్నాయని నేడు రాష్ట్ర ప్రభుత్వ మెగా డిఎస్సి ద్వారా 16,437 టీచర్ పోస్టులు పారదర్శకంగా భర్తీ చేసి మీరు జోక్ సమస్యలు నివారించేందుకు చర్యలు చేపడుతుందని, రాబోయే రోజులు అందరికి ఉపాధి అవకాశాలు కలుగుతాయి అన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖ అధికారులు, పలు గ్రామ ఎన్డీఏ కూటమి నాయకులు, మహిళా కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## బొబ్బిలి సత్యనారాయణ చేసిన స.హ.చట్టం దరఖాస్తు పై సమాచారం ఇవ్వని జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్ కు విచారణ నోటీసు జారీ చేసిన అదనపు కలెక్టర్ జి.వి.శ్యాంప్రసాద్ లాల్



జనసముద్రం న్యూస్ : సెప్టెంబర్ 22 ( పెద్దపల్లి జిల్లా ఇంచార్జ్ )పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన స.హ.చట్టం కార్యకర్త , సోషల్ వర్కర్ బొబ్బిలి సత్య నారాయణ ప్రజా సమాచార అధికారి జిల్లా పౌర సరఫరాల అధికారి కార్యాలయం పెద్ద పల్లి కి పెద్దపల్లి మండలంలోని రాఘవపూర్ గ్రామంలోని రేషన్ షాప్ నెంబర్. 3610054 రేషన్ డీలర్ తోట శ్రీనివాస్ కు సంబంధించి పలు అంశాలపై సమాచారం కొరకు తేదీ : 31జూలై 2024 రోజున ఆర్టిఐ దరఖాస్తు చేశారు. కానీ 30 రోజులు గడిచిన ప్రజా సమాచార అధికారి ఎలాంటి సమాచారం ఇవ్వకపోవడంతో తేదీ: 5 సెప్టెంబర్ 2024 రోజున పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సమాచార హక్కు చట్టం 2005 సెక్షన్ 19(1) మొదటి అప్పీలు దరఖాస్తు చేశారు. ఈ అప్పీలు దరఖాస్తు పై స్పందించిన అప్పిలేట్ అధికారి, అదనపు కలెక్టర్ జి.వి. శ్యాంప్రసాద్ లాల్ విచారణకు ఆదేశిస్తూ తేదీ : 23 సెప్టెంబర్ 2024 రోజున సాయంత్రం 5 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయం పెద్దపల్లి నందు విచారణ చేయుటకు తెలియజేస్తూ నోటీసు ప్రతులను పౌర సమాచార అధికారి , జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్ పెద్దపల్లి కి సంబంధిత రికార్డులతో హాజరు కాగలరని , ఆర్ టి ఐ దరఖాస్తు దారుడైన బొబ్బిలి సత్యనారాయణ కూడా హాజరు కావాలని నోటీసు లేఖలో తెలిపారు.

## కాళోజీ వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక







మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 22 మహబూబాబాద్ పట్టణ పరిధిలో ఎన్టీఆర్ స్టేడియంలో కాళోజి వాకర్స్ అసోసియేషన్– మహబూబాబాద్ జనరల్ బాడీ సమావేశం జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కాళోజి వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులు డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులు మైస నాగయ్య, మైస శ్రీనివాస్ సభ్యులను ఉద్దేశించి మాట్లాడారు. 2012వ సంవత్సరంలో ప్రజాకవి,నిత్య చైతన్య స్ఫూర్తి కాళోజి నారాయణరావు పేరు మీద కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. అప్పటినుండి కాళోజి వాకర్స్ ఆధ్వర్యంలో వాకర్స్ సౌకర్యార్థం స్టేడియం అభివృద్ధికి కృషి చేయడమే కాకుండా అనేక సామాజిక కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ అసోసియేషన్ లో అన్ని రంగాలకు చెందిన వ్యక్తులు సభ్యులుగా ఉన్నారని వారందరూ ఆరోగ్యంగా ఉండడం కోసం నిత్యం వాకింగ్, ఇతర వ్యాయామాలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దీనితోపాటు సామాజిక బాధ్యత గల పౌరులుగా ప్రజా సమస్యల పైన స్పందించి మన వంతు కర్తవ్యాన్ని నెరవేర్చాలని పిలుపునిచ్చారు . నూతనంగా ఏర్పడబోయే కమిటీ కాళోజి స్ఫూర్తితో పనిచేయాలని కోరారు. అనంతరం అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా డోలి సత్యనారాయణ, ముఖ్య సలహాదారులుగా మైస నాగయ్య, మైస శ్రీనివాస్, అధ్యక్షులుగా నామిరెడ్డి వెంకటరెడ్డి, సహాధ్యక్షులు తోడేటి వెంకన్న, ప్రధాన కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్, సమన్వయకర్త మందాటి మధుసూదన్ రావు, గౌరవ సలహాదారులుగా గూడూరు నాగేశ్వరరావు, కునుసోతు హట్యానాయక్, పెద్ది వెంకన్న కోట సుధాకర్, ఆరుట్ల పరమాత్మ చారి, ఉపాధ్యక్షులుగా జర్పుల వీరన్న, శ్యామల శ్రీనివాస్ రెడ్డి, బోర్ల ప్రభాకర్, హేమన్ రెడ్డి, గోనే శ్యామ్ రావు, కార్యదర్శులుగా కుర్ర మహేష్, దేవుడి మధుసూదన్ రెడ్డి, మేడ వెంకట్, తోడెం వెంకటేశ్వర్లు, సహాయ కార్యదర్శులుగా మద్దెర్ల రాజన్న, నలమాస విక్రం, పులి దామోదర్, నిర్వహణ కార్యదర్శులుగా బొప్పిడి శ్రీనివాసరెడ్డి, లింగాల సాగర్, కిషన్ నాయక్ ,ప్రచార కార్యదర్శులుగా రాచకొండ ఉపేందర్, వేముల రవీందర్ మహిళా కార్యదర్శిగా వడ్డేపల్లి సునీతాదేవి, సాంస్కృతిక కార్యదర్శి కోడెం శ్రీనివాస్, యోగా కన్వీనర్ పడాల పరమేశ్వర్, కార్యవర్గ సభ్యులుగా నల్లు దేవేందర్ రెడ్డి, జి బద్రు నాయక్, ధనసరి పగడయ్య, దేవ్ సింగ్,ఎం నరసింహారావు, గొంతి దేవేందర్ రెడ్డి, పాశం మల్లారెడ్డి, పోనుగోటి రామకృష్ణారావు, ఇమ్మానుయేల్, మహమ్మద్ అలీ, ఓలం విద్యాసాగర్ ఎన్నికయ్యారు

## కరాటే విద్యార్థులకు సన్మానం



జనసముద్రం న్యూస్ హుజూరాబాద్:గ్లోబల్ షో టో కాన్ కరాటే డో ఇండియా కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఎస్కే జలీల్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన విద్యార్థులు దమ్మక కామ్ సెటోరియా కరాటే వారి ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీ ఆదివారం రోజున కరీంనగర్ అంబేద్కర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన జాతీయ కరాటే పోటీలలో పాల్గొన్న హుజురాబాద్ కరాటే విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి వివిధ స్థాయిలలో గెలుపొందడం జరిగింది.. ఈ సందర్భంగా హుజురాబాద్ లోని స్థానిక న్యూ కాకతీయ హై స్కూలులో ఆదివారం రోజున ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ చందుపట్ల జనార్ధన్ మాట్లాడుతూ నేటి బాలలు రేపటి పౌరులైన చిన్నారులను విద్యతో పాటు కరాటే శారీరకంగా,మానసికంగా ఉన్నతులుగా తయారు చేయడమే కాకుండా వారిలో ఆత్మస్థైర్యాన్ని పెంచడంతోపాటు రేపటి సమాజానికి కావలసిన ఉత్తమ భావిభారత పౌరులుగా ఎదగడానికి తోడ్పడుతుందని తెలుపుతూ కరాటే ముఖ్యంగా నేటి సమాజంలో ఆడపిల్లలు తమను తాము ఏ సమయంలోనైనా రక్షించుకోవడానికి ఉపయోగపడుతుందని తెలియజేస్తూ ఈ సందర్భంగా విద్యార్థులు జాతీయ స్థాయిలో బహుమతులు పొందడానికి మార్గదర్శకులుగా నిలుస్తున్న ఎస్కే జలీల్ ని మరియు విద్యార్థులను అభినందించారు.అనంతరము బహుమతులు పొందిన విద్యార్థులను మెడల్స్ మరియు శాలువాలతో సన్మానించారు.. కార్యక్రమంలో పాల్గొన్న గ్లోబల్ షో టో కాన్ కరాటే డు ఇండియా గౌరవాధ్యక్షులు అంబాల ప్రభాకర్ ,రెండవ వార్డ్ కౌన్సిలర్ యాదగిరి నాయక్ ,కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కాజీపేట శ్రీనివాస్, అంబేద్కర్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ ఖలీల్ హుస్సేన్, జ్యోతి రావు పూలే కమిటీ అధ్యక్షుడు ఉప్పు శ్రీనివాస్ పటేల్,ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మైనార్టీ లీడర్ మొహమ్మద్, ఆలీమ్ ఎర్ర బజ్జు, నారాయణ మరియు మహమ్మద్ సలీం తదితరులు ఘనంగా సత్కరించారు




# అశ్వత్థామ పాత్రలో అమితాబ్ డూప్‌గా ఏడడుగుల సునీల్‌కుమార్

'కల్కి 2898 ఎడి' చిత్రంలో ఏడడుగుల అశ్వత్థామపాత్ర ప్రేక్షకుల్ని ఎంతగానో మెప్పించింది. అమితాబ్ బచ్చన్ ఆ పాత్రలో ఎంతగా ఒదిగిపోయారు. ద్వాపర యుగం నాటి పాత్ర కాబట్టి సినిమాలో మిగిలిన అన్ని పాత్రలు ఇప్పటి ఎత్తులో ఉన్నా అమితాబ్ 7 అడుగుల ఎత్తులో కనిపిస్తారు.ఆ పాత్ర ప్రేక్షకుల్ని ఎంతగానో ఆకర్షించింది. ఇదంతా గ్రాఫిక్ మాయాజాలం అనుకున్నారంతా. కానీ నిజంగానే అంత ఎత్తున్న ఆర్టిస్ట్ ఆ పాత్రను పోషించారు. అంటే అమితాబ్ బచ్చన్‌కు డూప్‌గా చేశారు. ఇందులో అమితాబచ్చన్‌కి డూప్‌గా జమ్మూ కశ్మీర్‌కు చెందిన సునీల్ కుమారం ఎత్తు ఏడు అడుగులు ఏడు అంగుళాలు. జమ్మూలోని పోలీస్ శాఖలో కానిస్టేబుల్ ఉద్యోగం చేస్తున్నాడు. సినిమాలపై ఉన్న ఆసక్తితో ప్రయత్నాలు చేశారు. కల్కి సినిమాతోపాటు పలు హిందీ సినిమాల్లో అవకాశం అందుకున్నారు. ప్రస్తుతం వరుసగా చిత్రాల్లో నటిస్తున్న సునీల్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'కల్కి' చిత్రీకరణ అనుభవాలను పంచుకున్నాడు. 'చిన్నప్పటి నుంచి నేను అమితాబ్ సర్ ఫ్యాన్. నేను మాత్రమే కాకుండా నా కుటుంబ సభ్యులు మొత్తం అమితాబ్ జీ ఫాన్సే. అలాంటి అమిత్ జీ కి డూప్‌గా నటించాలి అన్నప్పుడు సర్‌ప్రైజ్ అయ్యాను. కల్కి సినిమా సెట్స్‌లో మొదటి రోజు అడుగు పెట్టిన విషయం ఎప్పటికి మరచి పోలేను. ప్రభాస్, అమితాబ్ గారు కలిసి కూర్చుని ఉన్నారు. నన్ను చూడగానే నా వద్దకు వచ్చి మాట్లాడారు.




# కలీసా వచ్చేశాడు.. 'కూలీ'లో కన్నడ స్టార్ నటుడు ఉపేంద్ర



సూపర్ స్టార్ రజనీకాంత్ తమిళ అగ్ర దర్శకుడు లోకేష్ కనగరాజ్ కాంబినేషన్‌లో వస్తున్న తాజా చిత్రం 'కూలీ'. సన్‌పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధిమారన్ ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా.. తలైవ కెరీర్‌లో ఇది 171వ సినిమా. సౌత్ ఇండియన్ మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా షూటింగ్ జరుపుకుంటుంది.అయితే ఈ మూవీ నుంచి ఒక్కొక్క పాత్రను మేకర్స్ రివీల్ చేస్తున్న విషయం తెలిసిందే. ఇప్పటికే మలయాళ నటుడు, మంజుమ్మెల్ బాయ్స్ ఫేం సౌబిన్ షాహిర్‌తో పాటు అక్కినేని నాగార్జున, శృతి హాసన్, సత్య రాజ్ పాత్రలను రివీల్ చేసిన మేకర్స్ తాజాగా మరో పాత్రను వదిలారు. ఈ సినిమాలో కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర కలీసా అనే పాత్రలో నటించబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. ఈ సందర్భంగా ఉపేంద్ర ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది.మరోవైపు ఉపేంద్ర ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్ర దాదాపు ఏడేళ్ల గ్యాప్ తీసుకొని ఈ సినిమాను తెరకెక్కిస్తుండగా.. ఉపేంద్రకు జోడీగా రీష్మా నానయ్య నటిస్తుంది. మనోహరన్ శ్రీకాంత్ కేపి సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాంతర ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం సమకూర్చుతున్నాడు. ఇప్పటికే ఈ సినిమా నుంచి విడుదల చేసిన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంది.

# ఆ విషయంలో కాజోల్ నాకు స్ఫూర్తి: కృతి

'నన్నెంతో ప్రభావితం చేసిన నటి కాజోల్. ఆమెను ప్రేరణగా తీసుకొని చాలామంది హీరోయిన్లయ్యారు. వారిలో నేనూ ఒకదాన్ని' అంటున్నారు జాతీయ ఉత్తమనటి కృతి సనన్. కాజోల్‌తో కలిసి 'దో పత్తీ' అనే వెబ్‌సిరీస్‌లో నటించింది కృతి సనన్. ఈ సిరీస్ నిర్మాత కూడా తానే కావడం విశేషం. త్వరలోనే ఈ సిరీస్ ఓటీటీలో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా కాజోల్‌తో తన అనుబంధం గురించి మాట్లాడింది కృతి సనన్.'తొమ్మిదేండ్ల క్రితం 'దిల్‌వాలే' సినిమాలో కాజోల్ అక్కతో కలిసి నటించాను. అది నా రెండో సినిమా. సినిమాలపై పెద్దగా అవగాహన కూడా అప్పట్లో నాకు లేదు. సెట్‌లో ఎలా మాట్లాడాలో కూడా తెలీదు. ఆ సమయంలో అక్క నాకు అండగా నిలిచింది. ఎన్నో విషయాలు ఆమె వల్లే తెలుసుకున్నా. నటనా పరంగానే కాదు, వ్యక్తిత్వపరంగా కూడా కాజోల్ నాకు స్ఫూర్తి.' అని చెప్పుకొచ్చింది కృతి సనన్.



# నేనేం పబ్లిక్ ప్రాపర్టీని కాదు!

**సె**లెబ్రిటీల ప్రైవసీకి ఎప్పుడూ చిక్కే! పబ్లిక్ ఫిగర్ కావడంతో.. వాళ్లు పబ్లిక్‌లోకి రావడానికే జంకే పరిస్థితులు ఏర్పడుతున్నాయి. తాజాగా బాలీవుడ్ నటి తాప్సీకి ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఇటీవల ఓ పబ్లిక్ ప్లేస్‌లో తాప్సీ కనిపించింది. తెర మీద అలరించే నటి కండ్లముందు కనిపించేసరికి అక్కడి వారు ఫొటోలు, వీడియోలు తీయడానికి అత్యుత్సాహం ప్రదర్శించారు. 'వద్దు..' అని వారిస్తున్నా అభిమానులు వినకపోవడంతో తాప్సీ ఒకింత అసహనం వ్యక్తం చేసింది.'నేను నటిని మాత్రమే. పబ్లిక్ ప్రాపర్టీని కాదు. రెండిటికీ చాలా తేడా ఉంది. కెమెరా పట్టుకుని నాపైకి రావడం,ఫిజికల్‌గా హ్యాండిల్ చేయడం చాలా తప్పు. ఎవరైనా నో చెబితే వారి అభిప్రాయానికి గౌరవం ఇవ్వడం నేర్చుకోవాలి. ఇలా అంటున్నానని కొందరు నన్ను తప్పుగా అనుకోవచ్చు. అలాంటప్పుడు ఎందుకు హీరోయిన్‌గా చేస్తున్నావు అని ప్రశ్నించవచ్చు కూడా. కానీ నటన నాకు నచ్చిన వృత్తి. అందుకే సినిమాలు చేస్తున్నాను' అని చెప్పుకొచ్చింది తాప్సీ.

# సమంత నాకు క్లోజ్.. అందుకే నా వీడియోలు..: ఉర్ఫీ జావేద్



సినిమాలతో కంటే విభిన్నమైన డ్రెస్సింగ్‌తో పాపులారిటీ తెచ్చుకున్నది ఉర్ఫీ జావేద్. ఆమె లైఫ్‌ట్కస్టైల్ మిగిలిన నటులకన్నా భిన్నంగా ఉంటుంది. 'ఫాలో కర్‌లో యార్' టైటిల్‌తో ఆమె జీవిత కథ వెబ్ షోగా రూపొందింది. ఇది 'అమెజాన్ ప్రైమ్'లో స్ట్రీమింగ్ అవుతున్నది. ఈసిరీస్ ప్రమోషన్లలో బిజీగా ఉన్న ఉర్ఫీ.. తాజాగా ఒక ఇంటర్వ్యూలో సమంత గురించి సంచలన వ్యాఖ్యలు చేసింది. 'నేను చేసిన వీడియో నచ్చితే సమంత తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో షేర్ చేస్తుంది. దీని వెనుక ఆమెకు ఎలాంటి ఉద్దేశం ఉందని అనుకోవడం లేదు. ఆమెతో ఇన్‌స్టాగ్రామ్‌లో పలుసార్లు మాట్లాడాను. సమంత, నేను స్నేహితులం' అని చెప్పుకొచ్చింది. అంతేకాదు, అర్జున్ కపూర్ అంటే తనకు చాలా ఇష్టమనీ, ఆయనపై ప్రేమ ఉందని కామెంట్ చేసింది. వెరైటీ డ్రెస్సులతో నిత్యం వార్తల్లో నిలిచే ఈ బ్యూటీ ముక్కుసూటిగా మాట్లాడుతూ సోషల్ మీడియాలో రోజూ ట్రెండింగ్‌లో ఉంటుంది.

# అంతిమంగా సినిమా బతకాలి.. హేమ కమిటీ రిపోర్ట్‌పై స్పందించిన మమ్ముట్టి



మలయాళం సినీ ఇండస్ట్రీ ప్రస్తుతం కాస్టింగ్ కౌచ్ ఆరోపణలు ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. మలయాళ ఇండస్ట్రీలో మహిళలపై జరుగుతోన్న వేధింపులపై కేరళ ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీ ని ఏర్పాటు చేయగా.. ఈ కమిటీ సిద్ధం చేసిన రిపోర్ట్ ఆ పరిశ్రమను కుదిపేస్తోంది. అయితే ఈ కమిటీ ఇచ్చిన రిపోర్ట్‌పై తాజాగా మెగాస్టార్ మమ్ముట్టి స్పందించాడు. ఈ పోస్ట్ మలయాళ సినిమా ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితుల ఆధారంగా చేసింది. ఇన్ని రోజులు ఈ ఘటనపై స్పందించకపోవడానికి కారణం. ఆరోపణలు ఎదుర్కొంటున్న నటీనటులు, అండగా ఉండే అసోసియేషన్ స్పందించాలి. నేను కూడా నటుడిగా నా అభిప్రాయాన్ని తెలియజేయాలని అనుకున్నాను. సినిమా అనేది సమాజానికి ప్రతిరూపం. సమాజంలోని మంచి చెడులన్నీ సినిమాలో ఉంటాయి. సినిమా పరిశ్రమ అంటే సమాజం చాలా శ్రద్ధ చూపుతుంది.అందుకే అక్కడ జరిగే చిన్న సమస్య అయిన పెద్దగా కనిపిస్తుంది. ఈ రంగంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చిత్ర నిర్మాతలు జాగ్రత్తగా, అప్రమత్తంగా ఉండాలి. ఎన్నడూ జరగకూడనిది ఘటనలు ఏదైనా జరిగిన తర్వాత సినిమా పరిశ్రమను అధ్యయనం చేసి, పరిష్కారాలను సూచించడానికి, అలాగే చర్యలను చేపట్టడానికి ఒక నివేదికను సిద్ధం చేయడానికి ప్రభుత్వం జస్టిస్ హేమ కమిటీని ఏర్పాటు చేసింది. హేమ కమిటీని నివేదికలో వివరించిన సిఫార్సులు మరియు పరిష్కారాలను మేము హృదయపూర్వకంగా స్వాగతిస్తాము అలాగే మద్దతు ఇస్తున్నాము. వాటిని అమలు చేసేందుకు సినీ పరిశ్రమలోని అన్ని సంఘాలు తేడా లేకుండా చేతులు కలపాల్సిన సమయం ఆసన్నమైంది. వచ్చిన ఫిర్యాదులపై పోలీసుల విచారణ ముమ్మరంగా సాగుతోంది. జస్టిస్ హేమ కమిటీ నివేదిక పూర్తి వెర్షన్ కోర్టు ముందు ఉంది. పోలీసులు నిజాయితీగా విచారణ చేయనివ్వండి. శిక్షలను కోర్టు నిర్ణయించనివ్వండి. సినిమాలో 'పవర్‌హౌస్' అనేదే లేదు. సినిమా అంటే అలాంటివి ఉండే ఫీల్డ్ కాదు.